
కాసులిస్తేనే.. కనికరం!

మచిలీపట్నం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులు బరితెగించి వ్యవహరిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాల నుంచి వచ్చే భూములకు సంబంధించిన ఫైల్స్‌ను అనేక కారణాలతో పెండింగ్‌లో పెడుతున్నారు. అడిగినంత మామూళ్లు చెల్లించిన తర్వాతే క్లియర్ చేసి పంపిస్తున్నారు. లేదంటే సంవత్సరాల తరబడి పని అవ్వకుండా తొక్కిపెట్టేస్తున్నారు. భారీ మొత్తంలో ముడుపులు ఇవ్వలేదని రోడ్డు కం రైలు మార్గానికి భూములిచ్చిన రైతులకు నగదు ఇవ్వకుండా ఏళ్లతరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ఇటీవల జరిగిన ఏసీబీ దాడిలో ఓ ఉద్యోగి పట్టుబడినా మరో ఉద్యోగి తన తీరు మార్చుకోలేదని పలువురు విమర్శలు చేస్తున్నారు.

మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగుల బరితెగింపు

తహసీల్దార్ కార్యాలయాల నుంచి వచ్చే ఫైళ్లన్నీ పెండింగే!



- అడిగినంత లంచం ఇస్తేనే క్లియరెన్స్ వచ్చేది!
- భారీ మొత్తం ఇవ్వలేదని 2023 నుంచి తొక్కిపెట్టిన రైతుల ఫైల్
- రోడ్ కం రైలు మార్గానికి భూములిచ్చిన రైతులకు చుక్కలు
- ఇటీవల ఏసీబీ దాడిలో పట్టుబడిన ఓ ఉద్యోగి
- అయినా తీరు మార్చుకోని మరో ఉద్యోగి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నంలోని ఆర్డీవో కార్యాలయంలో అవినీతి పెరిగిపోయింది. ఇటీవల జరిగిన ఏసీబీ అధికారుల దాడిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బీరం త్రినాథ్ రూ.40 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. అయితే త్రినాథ్‌తో పాటు మరో ఉద్యోగిని కూడా అదేరోజు పట్టు కునేందుకు ఏసీబీ అధికారులు మచిలీపట్నం వచ్చారని, అతను తెలివిగా తప్పుకున్నాడని రెవెన్యూ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే ఈ సీనియర్ ఉద్యోగి తనకు త్వరలో తహసీల్దార్‌గా పదోన్నతి వస్తుందని, అందుకే అవినీతికి దూరంగా ఉంటున్నానని పైకి చెబుతూ, తెరవెనుక మాత్రం తనదైనశైలిలో అవినీతికి పాల్పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. భూములకు సంబంధించిన వివిధ ఫైళ్లు ఆర్డీవో కార్యాలయానికి వస్తే, వాటిని పరిశీలించి, వాటిలోని లొసుగులను తెరపైకి తెచ్చి అర్జీదారులతో బేరసారాలు నడిపి పనులు చేయడం ఈ ఉద్యోగికి వెన్నతో పెట్టిన

మిగతా 6లో..

రెవెన్యూ అసోసియేషన్ నాయకులు హెచ్చరించినా..



ఆర్డీవో కార్యాలయం

మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం పరిధిలోని 11 మండలాల తహసీల్దార్ కార్యాలయాల నుంచి వచ్చే ఫైళ్లను పరిష్కరించకుండా ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే ఇద్దరు కీలక ఉద్యోగులు పెండింగ్ పెట్టడంపై అనేక ఫిర్యాదులు అందాయి. వీరు అనుసరిస్తున్న విధానంపై మండలాల్లో పనిచేసే రెవెన్యూ ఉద్యోగులు రెవెన్యూ అసోసియేషన్ నాయకుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఏసీబీ అధికారుల దాడి జరగకముందే ఆ ఇద్దరు ఉద్యోగులను రెవెన్యూ అసోసియేషన్ పెద్దలు పిలిచి మీ వ్యవహారశైలి వల్ల తోటి ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని, కొంతమేర దూకుడు తగ్గించాలని సూచించారు. అయినా వినకుండా దూకుడుగా వెళ్లడంతో ఏసీబీ అధికారులకు ఒక ఉద్యోగి చిక్కాడు. దీంతో మరో ఉద్యోగిని రెవెన్యూ అసోసియేషన్ నాయకులు పిలిచి ఇప్పటికైనా పనితీరు మార్చుకోవాలని, లేకుంటే ఇబ్బందులు పడతావని చెప్పినట్టు సమాచారం.

దసరా ఉత్సవాల్లో సామాన్యుడే వీఐపీ!

ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఉత్సవాలు నిర్వహిద్దాం

- దుర్గగుడి అధికారులతో కమిషనర్ భేటీ నేడు
- సామాన్యులకు దర్శనం, ఉత్సవ ఏర్పాట్లు, అభివృద్ధి పనులపై ప్రధానంగా చర్చ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): దసరా ఉత్సవాల్లో సామాన్యుడే వీఐపీగా ఉత్సవాలను నిర్వహించేందుకు దేవదాయశాఖ కసరత్తు చేస్తోంది. గురువారం కమిషనర్ రామచంద్రమోహన్ దుర్గమల్లేశ్వర స్వామి ఆలయ అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సామాన్యులకు ఇబ్బందులు లేకుండా దుర్గమ్మ దర్శనం కల్పించడమే ప్రధాన అజెండాగా చర్చించనున్నారు. దసరా ఉత్సవాలకు వీవీఐపీలు, వీఐపీలు, ఉభయ దాతలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఇలా అనేక రూపాల్లో అంతరాలయ దర్శనాలకు అనుమతులు ఇస్తున్నారు. ఏటా దసరా ఉత్సవాల్లో అంతరాలయ దర్శనాల కారణంగా సామాన్య భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.500 టికెట్ కొనుగోలు చేసిన వారికి కూడా ఇబ్బందులు తప్పటం లేదు. దీనికి తోడు శాఖల మధ్య సమన్వయం లేకుండా అనధికార అంతరాలయ దర్శనాలకు ఎవరి స్థాయిలో వారు కొండమీద చర్యలు చేపడుతుండటంతో దసరా ఉత్సవాల నిర్వహణ విషయంలో చెడ్డపేరు వస్తోంది. ఈ సారి ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని దేవదాయశాఖ కూడా తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలనుకుంటోంది. దసరా ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించబోతున్నారు. అధికారులందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని కమిషనర్ భావిస్తున్నారు. తదుపరి దసరా సమన్వయ కమిటీ సమావేశాల్లో దేవదాయశాఖ తరఫున చర్చించాల్సిన అంశాలకు సంబంధించి కూడా చాలా స్పష్టమైన

మిగతా 6లో..

ఫెస్టివల్ ఆఫీసర్‌గా భ్రమరాంబ

దసరా ఉత్సవాల ఫెస్టివల్ ఆఫీసర్‌గా దుర్గగుడి పూర్వ ఈవో భ్రమరాంబను దేవదాయశాఖ నియమించింది. త్వరలో పదవీ విరమణ చేయనున్న ఈమెకు కీలక బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. గురువారం నాటి సమావేశంలో భ్రమరాంబ కూడా పాల్గొననున్నారు. గతంలో దసరా ఉత్సవాలు నిర్వహించిన అనుభవం ఆమెకు ఉండటంతో ఫెస్టివల్ ఆఫీసర్‌గా నియమించినట్టు తెలుస్తోంది.

పేద రైతుల పాడి పశువులకు హాస్టళ్లు

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

6

పాఠశాలల నిర్వహణకు రూ.1.48 కోట్లు విడుదల

6

- సమగ్ర శిక్ష ఏపీసీ కుముదిని సింగ్



సెక్యూరిటీ లేని జీవితాలు!

- 2 నెలలుగా అందని వేతనాలు
- ఇంటి నిర్వహణ కష్టమవుతోంది
- సెక్యూరిటీ సిబ్బంది ఆవేదన

6

భూమాయ

జాతీయ రహదారి విస్తరణ కోసం తీసుకున్న భూమిని ఓ ప్రైవేట్ వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రయత్నించడం కలకలం సృష్టించింది. దీనిపై చీఫ్ సెక్రటరీ స్థాయి వరకు ఫిర్యాదులు వెళ్లగా, ఆయన కలెక్టర్ లక్ష్మీశను సమాచారం కోరారు. కలెక్టర్ విచారణకు ఆదేశాలు ఇవ్వడంతో విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ నున్న సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. దీంతో బైపాస్ స్థలం అక్రమ రిజిస్ట్రేషన్‌కు బ్రేక్ పడింది.

ఎన్‌హెచ్ విస్తరణకు సేకరించిన భూమి విక్రయించే యత్నం

- భూమిని ఇచ్చినట్టే ఇచ్చి.. పరిహారం కూడా పొంది..
- అందులోని మూడు సెంట్లు విక్రయించే పన్నాగం
- రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని రూరల్ తహసీల్దార్ లేఖ
- కలెక్టర్ లక్ష్మీశను వివరణ కోరిన చీఫ్ సెక్రటరీ
- కలెక్టర్ ఆదేశాలతో విచారణ మొదలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జాతీయ రహదారి-16 విస్తరణలో భాగంగా విజయవాడ పశ్చిమ బైపాస్ కోసం విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో సేకరించిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఓ వ్యక్తి తలపెట్టిన ప్రయత్నానికి రెవెన్యూ అధికారులు బ్రేక్ వేశారు. జాతీయ రహదారి నిమిత్తం సేకరించిన భూమికి రిజిస్ట్రేషన్ చేయొద్దని కోరుతూ నున్న సబ్ రిజిస్ట్రార్‌కు విజయవాడ రూరల్ తహశీల్దార్ సుగుణ లేఖ రాశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..



అంబాపురం వద్ద విజయవాడ బైపాస్ పరిధిలోని స్థలం ఇదే

కథ ఇదీ..

విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని విజయవాడ రూరల్ మండలం అంబాపురంలోని ఎల్‌పీఎం నెంబర్ 629 (పాత సర్వే నెంబర్ 14/1ఎఫ్3) భూమికి సంబంధించిన వివాదమిది. ఈ సర్వే నెంబర్‌లోని 3 సెంట్ల స్థలాన్ని తనదిగా చెప్పుకొంటున్న చాగంటి లక్ష్మారెడ్డి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారు. సర్వే నెంబర్ 14/1ఎఫ్2సీలోని 1,012 చదరపు మీటర్ల (0.25 ఎకరాలు) భూమిని ఇప్పటికే విజయవాడ పశ్చిమ బైపాస్ కోసం తీసుకున్నారు. జిల్లా రెవెన్యూ యంత్రాంగం అవార్డు నెంబర్ 12/2013 ద్వారా 47.88 కిలోమీటర్ల వరకు భూమిని సేకరించగా, అందులో అంబాపురం గ్రామంలో మొత్తం 49 సర్వే నెంబర్ల పరిధిలో 1,13,274 చదరపు మీటర్ల స్థలాన్ని తీసుకుంది. ఇందులో భాగంగా చాగంటి లక్ష్మారెడ్డికి సంబంధించిన 1,012 చదరపు మీటర్ల స్థలాన్ని సేకరించినట్టు రెవెన్యూ యంత్రాంగం తన అవార్డు కాపీలో పేర్కొంది. దీనినిబట్టి చూస్తే లక్ష్మారెడ్డికి 3 సెంట్ల స్థలం ఉండే అవకాశం లేదు. తనకున్న పాతిక సెంట్లను తీసుకున్నపుడు ఆయనకు 3 సెంట్లు ఎలా మిగులుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. భూమి సేకరణ అనంతరం 2013, నవంబరు 4 నాటికి చాగంటి లక్ష్మారెడ్డికి ఎల్‌పీఎం నెంబర్ 629లో ఏ విధమైన భూమి లేదని, ఇప్పుడు అదే సర్వే నెంబరు (రీ సర్వే ఎల్‌పీఎం నెంబర్ 629) 3 సెంట్ల భూమి ఉందంటూ టైటిల్ లేకుండా విక్రయించటానికి ప్రయత్నిస్తున్నాడని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ భూమిని పశ్చిమ బైపాస్ కోసం తీసుకున్నారు కాబట్టి.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణం నిలిపివేయాల్సిందిగా సూచించారు.

రీ సర్వేలో మాయ

ఇటీవల జరిగిన రీ సర్వేలో లక్ష్మారెడ్డికి 3 సెంట్లు ఉన్నట్టు రికార్డులకెక్కింది. ఇది ఎవరు చేశారన్నది తేలాల్సి ఉంది. దీనిని అడ్డం పెట్టుకుని లక్ష్మారెడ్డి ఈ స్థలాన్ని వేరొకరికి విక్రయానికి పెట్టారు. దీనికోసం నున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు పూనుకున్నారు. రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి పరిశీలన జరిపాక.. ఈ స్థలం లేదని తెలిసింది. దీనిపై అంతర్గత విచారణకు తహసీల్దార్ ఆదేశించటంతో పాటు నున్న సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు.

మంగినపూడి బీచ్ రహదారి అభివృద్ధికి రూ.1.20 కోట్లు విడుదల

మచిలీపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్ రహదారి అభివృద్ధి కోసం రూ.1.20 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంగినపూడి బీచ్‌కి వెళ్లే 259వ రాష్ట్ర రహదారిని 3.950 కిలో మీటరు నుంచి 10.200 కిలోమీటరు వరకు అభివృద్ధి చేయనున్నారు. అలాగే 1.490 కిలోమీటరు నుంచి 10.860 కిలోమీటరు వరకు డివైడర్‌కు రంగులు అద్దనున్నారు.

మహిళా టెక్నీషియన్ల నియామకానికి చర్యలు

6



నున్న మ్యాంగో మార్కెట్‌లో గణపతి విగ్రహాలకు రంగులు అద్దుతున్న కళాకారులు

రావయ్యా.. లంబోదర!

చవితి పందిళ్లకు సిద్ధమవుతున్న గణనాథులు

- నున్న మ్యాంగో మార్కెట్‌లో విగ్రహాలకు రంగులద్దుతున్న కళాకారులు
- అడుగు నుంచి 12 అడుగుల ఎత్తు వరకు తయారీ

8

మహిళా టెక్నీషియన్ల నియామకానికి చర్యలు

» ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎకో 2డి కేంద్రం పనితీరుపై బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత సమీక్షించారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. మహిళలకు ఇబ్బంది లేకుండా 2డి ఎకో పరీక్షలు నిర్వహించేందుకు మహిళా టెక్నీషియన్‌ను నియమించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మహిళల ఇబ్బందులపై ఆమె చర్చించారు. ఆసుపత్రిలో ఉచితంగా ఎకో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మెడికల్ కళాశాల నుంచి ఇద్దరు పురుష టెక్నీషీయన్లను మాత్రమే ఇచ్చారని, మహిళా టెక్నిషియన్ల అవసరంపై ఉన్నతాధికారులకు లేఖలు రాశామన్నారు. త్వరలో ఈ పోస్టులు భర్తీ చేస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మహిళలకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

సొసైటీలకు త్రిమెన్ కమిటీలు

» త్వరలో వెలువడనున్న ఉత్తర్వులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కంచికచర్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మిగిలిన సహకార సంఘాలకు త్రిమెన్ కమిటీలను నియమించేందుకు తుది కసరత్తు జరుగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సొసైటీల వారీగా నియమించనున్న కమిటీ ఛైర్‌పర్సన్, సభ్యుల వివరాలను సేకరించి పంపుతున్నారు. త్రిమెన్ కమిటీలను నియమిస్తూ త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడనున్నాయి. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అన్నదాత రుణ అవస్థలు', 'పాలకవర్గాలకు నోచని పీఏసీఎస్‌లు' పేరుతో వచ్చిన కథనానికి ప్రభుత్వ పెద్దలు స్పందించారు. పీఐసీల పాలనతో రుణాల్లో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్న విషయంపై ఉన్నతాధికారుల్లో కదలిక వచ్చింది. కమిషనర్ నుంచి జిల్లా రిజిస్ట్రారు వరకు రుణాలపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, రుణాలు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. దీంతో పాటు త్రిమెన్ కమిటీల అంశం ప్రస్తావనకు వచ్చింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 425 సంఘాలు ఉండగా, రెండు విడతల్లో కేవలం 117 సంఘాలకు మాత్రమే పీఐసీలను నియమించగా, ఎన్టీఆర్ జిల్లాలో కేవలం 11 సంఘాలకు మాత్రమే పీఐసీలను నియమించారు. మిగిలిన సంఘాలకు తక్షణమే త్రిమెన్ కమిటీలను నియమించాలని ఆదేశించడంతో సభ్యుల అర్హత, అనర్హతలపై విచారణ జరిపి కార్యదర్శులు ఆఘమేఘాలపై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారు.



బోనస్ చెక్కులు పంపిణీ చేస్తున్న చలసాని ఆంజనేయులు

పేద రైతుల పాడి పశువులకు హాస్టల్స్

» విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్. ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులను పోషించలేని పేద రైతుల పాల ఉత్పత్తి వ్యయం తగ్గించడానికి ప్రయోగాత్మకంగా జిల్లాలో రెండు పశువుల హాస్టల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక కాకాని కల్యాణ మండపంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని 135 సంఘాలకు తొలివిడత నాలుగు నెలల బోనస్ రూ1.79,77,852లు పంపిణీ చేశారు. క్లస్టర్ పరిధిలోని కార్యదర్శులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ, గతంలో 2002లో ముఖ్యమంత్రి చంద్రబాబు పశువులకు హాస్టల్ ఏర్పాటు చేశారన్నారు. అదే తరహాలో ఈనెల 16న నందిగామ నియోజకవర్గంలోని మునగచర్ల గ్రామంలో పశువుల హాస్టల్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. పెదకళ్లేపల్లి ప్రాంతంలో మరో హాస్టల్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పాడి పశువులను పెంచలేని రైతులు పశువులు కొనుగోలు చేసి హాస్టల్‌లో పెట్టి రైతులంతా సామూహికంగా పోషించుకోవచ్చన్నారు. పీ-4 పథకం కింద ఎంపిక చేసిన పాడి రైతుల రుణాలకు యూనియన్ వడ్డీ భరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జంక్షన్ పాల శీతల కేంద్రం మేనేజర్ ఎం.హరిబాబు, ఫీడ్ కమిటీ సభ్యులు పిన్నమనేని లక్ష్మీప్రసాద్ పలు సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణకు రూ. 1.48 కోట్లు విడుదల

» సమగ్ర శిక్ష ఏపీసీ కుముదిని సింగ్

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్, ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలన్నింటికీ తొలి విడతగా రూ. కోటి 48 లక్షలు విడుదల చేసినట్టు సమగ్ర శిక్ష ఏపీసీ కుముదిని సింగ్ పేర్కొన్నారు. వాటిల్లో 20 శాతం నిధులను మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలకు వినియోగించుకునేలా ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో 9 జూనియర్ కళాశాలలు, 18 హైస్కూల్ ప్లస్ పాఠశాలలు, 160 ఉన్నత పాఠశాలలు, 150 ప్రాథమికోన్నత పాఠశాలలు, 979 ప్రాథమిక పాఠశాలలకు ఈ నిధులను విడుదల చేస్తున్నారు. 30 మంది విద్యార్థులుంటే రూ. 10వేలు, 100 మంది ఉంటే రూ. 25 వేలు, 250 మంది ఉంటే రూ. 50 వేలు, 1000 మంది ఉంటే రూ.75 వేలు, 1000 మందికిపైగా ఉంటే రూ. లక్ష చొప్పున మంజూరు చేస్తున్నారు. పాఠశాలల ఖాతాకే నేరుగా నిధులు జమవుతున్నాయి. ఈ సందర్భంగా కుముదిని సింగ్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకనుగుణంగా నిధులను వినియోగించాలన్నారు. తొలి విడతగా 50 శాతం నిధులు విడుదల చేశామన్నారు.



మండలి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

మండలికి ఘనంగా నివాళులు

నాగాయలంక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘానికి దివంగత ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించటంతో నాగాయలంకలోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి ఏడాది పొడవునా పార్టీలకతీతంగా పూలదండలు వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు, మండలి శత జయంతి కమిటీ కన్వీనర్ తలశిల స్వర్ణలత తెలిపారు. బుధవారం మండలి విగ్రహానికి కమిటీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.





దారి మధ్యలో పార్కింగ్ చేసిన వాహనాన్ని పక్కన పెడుతూ.. స్ట్రెచర్‌లు తీసుకెళుతూ.. ఇతర విధుల్లో సెక్యూరిటీ మహిళా సిబ్బంది

సెక్యూరిటీ లేని జీవితాలు!

» జీజీహెచ్‌లో సెక్యూరిటీ సిబ్బందికి అందని వేతనాలు

» రెండు నెలలుగా ఇబ్బందులు

» ఇంటి నిర్వహణ కష్టమవుతోందని కన్నీటి పర్యంతం

» కొత్త కాంట్రాక్టర్ రావడం వల్లే ఈ పరిస్థితి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి రెండునెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పాత, కొత్త ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సుమారు 210 మందికి పైనే సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో సగానికిపైగా మహిళా సిబ్బందే. వీరికి రూ.10 వేలనుంచి రూ.18 వేలవరకు జీతాలు చెల్లిస్తుంటారు. వీరంతా ఆసుపత్రిలో సెక్యూరిటీపరమైన సమస్యలు తలెత్తకుండా విధులు నిర్వహిస్తారు. ఈ సెక్యూరిటీ నిర్వహణ బాధ్యతలను ఓ కాంట్రాక్టు సంస్థ దక్కించుకుంది. ఈ సంస్థ తొలి రెండునెలలు జీతాలు చెల్లించపోవడం పట్ల సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదని చెబుతున్నారు.

అప్పుల బాధతో అవస్థలు పడుతున్నాం..

సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో అధికంగా మహిళలే ఉన్నారు. వీరిలో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారున్నారు. రెండు నెలలుగా జీతాలు రాక ఇల్లు గడవడానికి అప్పులు చేయాల్సి వస్తోందని పలువురు సిబ్బంది చెబుతున్నారు. వీరికి వచ్చేవే అరకొర జీతాలు. నెలంతా పనిచేస్తే కేవలం రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు వచ్చినా ప్రయాణ ఖర్చులకే సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి బాధ్యతలు నెట్టుకొస్తున్న వారైతే మరీ ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల ఫీజులు, నిత్యావసరాలకు అప్పులు చేయాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు.

అన్ని పనులూ చేయిస్తున్నారు..

సెక్యూరిటీ సిబ్బందిని ఇక్కడ ఇతర పనులకూ వినియోగిస్తున్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో పనిచేసే మహిళా సెక్యూరిటీ సిబ్బంది స్ట్రెచర్, వీల్‌చైర్లు తీసుకువచ్చి రోగుల సహాయకులకు అందించడం వంటి పనులు చేస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో అస్తవ్యస్తంగా పెట్టిన వాహనాలను మహిళలతో చేయించడం కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

రెండు నెలలైనా అందని వేతనాలు

ప్రభుత్వాసుపత్రి టెండర్లలో ఓ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. జూన్ నెల జీతం పడకపోవడంతో సిబ్బంది ప్రశ్నించగా బ్యాంకు, పీఎఫ్ అకౌంట్లు, రికార్డులు ట్రాన్స్‌ఫర్ చేయడానికి సమయం పట్టిందని, ఆగస్టు ఒకటో తేదీన జూన్, జూలై నెలల వేతనాలు జమ చేస్తామని కాంట్రాక్టరు చెప్పినట్టు సిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికీ జీతాలు పడకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టరుతో మాట్లాడుతున్నాం

మే నెలలో కొత్త కాంట్రాక్టర్‌కు టెండర్ దక్కించుకున్నారు. మొదటి నెల అకౌంట్లు మార్పులు చేయాలని కాంట్రాక్టర్ కోరారు. అందుకే మొదటి నెల అనుమతులు ఇచ్చాం. రెండో నెల కూడా జీతాలు పడకపోవడంతో సెక్యూరిటీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారన్న విషయం నా దృష్టికి వచ్చింది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి జీతాలు తొందరగా వేసేలా చూడాలని ఆదేశించాం.

- సత్యనారాయణ, డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్

జలజగడం సమస్య పరిష్కారం



కార్మికులతో చర్చిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

(ఆంధ్రజ్యోతి- విజయవాడ)

జలజగడం సమస్యకు గ్రామీణ నీటి సరఫరా అధికారులు ఎట్టకేలకు ముగింపు పలికారు. ఇబ్రహీంపట్నం హెడ్‌వాటర్ వర్క్స్ వర్కర్ల మెరుపు సమ్మెను ఎట్టకేలకు అధికారులు నివారించారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం 'జలజగడం' శీర్షికతో ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది. ఈ కథనంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీకి ఫోన్ చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ఈఎన్‌సీకి ఎన్టీఆర్ ఎస్సీ విద్యాసాగర్ ఫోన్‌చేసి సీరియస్ అయ్యారు. ఈఎన్‌సీ ఫోన్‌తో విద్యాసాగర్, మరికొందరు ఇంజనీర్లు కలిసి ఇబ్రహీంపట్నం హెడ్‌వాటర్ వర్క్స్‌కు వెళ్లారు. ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్

ఇదే సందర్భంలో గ్రామీణాభివృద్ధి పంచాయితీరాజ్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శశిభూషణ్‌కు ఫోన్ చేయగా ఆయన లిఫ్ట్ చేయలేదు. దీంతో ఎమ్మెల్యే వసంతకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖ ఫోన్‌చేసి తాను వెంటనే సీఎంఓ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. ఆ తరువాత శశిభూషణ్‌కుమార్ ఎమ్మెల్యే వసంత్‌కు ఫోన్ చేశారు. ఇబ్రహీంపట్నం హెడ్ వాటర్ వర్క్స్ పరిధిలోని 120 గ్రామాల ప్రజలు కార్మికుల సమ్మె కారణంగా మూడు రోజులుగా దాహార్తితో అలమటిస్తున్నారని, ఇంకెన్ని రోజులు సమస్యను పరిష్కరించరని సీరియస్ అయ్యారు. దీంతో శశిభూషణ్‌కుమార్ ఈఎన్‌సీకి ఫోన్‌చేసి తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ ఇబ్రహీంపట్నం హెడ్ వాటర్‌వర్క్స్‌కు బయలుదేరారు. అధికారులను అడిగి అక్కడి పరిస్థితి గురించి తెలుసుకున్నారు. కార్మిక సంఘ నాయకులతో చర్చించారు. మరోవైపు కాంట్రాక్టర్‌తోను చర్చించారు. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బకాయిలు రెండుమూడు రోజుల్లో చెల్లిస్తామని చెప్పారు. తక్షణం సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఈఎన్‌సీ విజ్ఞప్తి మేరకు కార్మికులు తాత్కాలికంగా సమ్మెను విరమించారు. దీంతో ప్రస్తుతానికి సమస్య పరిష్కారమైంది.

ఎమ్మెల్యే కారును అడ్డుకున్న దుర్గగుడి సిబ్బందిపై వేటు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం ప్రోటోకాల్ విభాగంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై ఈవో వీకే శీనానాయక్ కొరడా ఝుళిపించారు. వారికి నోటీసులు జారీ చేశారు. ఈనెల 5వ తేదీన యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దుర్గమ్మ దర్శనానికి విచ్చేశారు. ఆయన ముందుగానే సంబంధిత అధికారులకు సమాచారం తెలియపరిచారు. అయితే ఘాట్ రోడ్డులో ఓం టర్నింగ్ వద్ద విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డుకు ప్రోటోకాల్ విభాగం సిబ్బంది సమాచారం ఇవ్వకపోవటంతో ఎమ్మెల్యే కారును నిలుపుదల చేశారు. విషయం తెలుసుకున్న ఈవో పూర్తి విచారణ చేసి విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రోటోకాల్ సూపరింటెండెంట్ కుర్రేళ్ల శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ డి.వి.ఎస్.రాజు, రికార్డు అసిస్టెంట్ పి.శ్రీనివాసులు, అటెండర్ జి.కృష్ణమ్మ, తాళం (భజంత్రీ) బి.ఓంకార్‌లను సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేసి విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. వారిస్థానంలో సూపరింటెండెంట్ వి.సూర్యనారాయణ మూర్తి (దత్తత ఆలయాలు), కె.సతీష్ జూనియర్ అసిస్టెంట్ ల్యాండ్స్ విభాగం, ఎం.జయప్రకాష్, రికార్డు అసిస్టెంట్, (ఈ.ఓ పేషి), ఎన్ఎంఆర్‌లు జి.పునీత్ కుమార్, అన్న ప్రసాదం విభాగం, ఎం.సి.ఎస్.వరప్రసాద్‌లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీచేశారు.

సికింద్రాబాద్-మైసూర్, చర్లపల్లి-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ : ప్రయాణికుల రద్దీని తగ్గించటానికి దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు సికింద్రాబాద్-మైసూర్, చర్లపల్లి-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పీఆర్ఓ ఎ.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-మైసూర్ (07033) ఈనెల 8 నుంచి 29 వరకు సోమ, శుక్రవారాల్లో, మైసూర్-సికింద్రాబాద్ (07034) ఈనెల 9 నుంచి 30 వరకు మంగళ, శనివారాల్లో, చర్లపల్లి-కాకినాడటౌన్ (07031) ఈనెల 8న శుక్రవారం, కాకినాడ టౌన్-చర్లపల్లి (07032) ఈనెల 10వ తేదీ ఆదివారం అదనంగా రైళ్లు నడుపుతున్నట్టు తెలిపారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరంలో 11వ తరగతి లేటరల్ ప్రవేశానికి ఆగస్టు 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.ఏధునందన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో 11వ తరగతిలో లేటరల్ ప్రవేశానికి ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఆగస్టు 10వ తేదీలోగా విద్యాలయాల్లోగాని, జవహర్ నవోదయ విద్యాలయ (జెఎన్‌వీ) అధికారిక వైబ్‌సైట్ ద్వారాగాని దరఖాస్తు చేసుకోవచ్చని వేలేరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఏధునందన కోరారు.

దసరా ఉత్సవాల్లో సామాన్యుడే వీఐపీ!

(5వ పేజీ తరువాయి)

అభిప్రాయంతో ఉండేందుకు కూడా సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

టెండర్లపైన చర్చ!

మరోవైపు దసరా ఉత్సవాలకు టెండర్ల ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. ఏ ఏర్పాట్లు చేసినా.. చూడటానికి సాంకేతికంగా, ఆధునికంగా ఉండాలన్న అభిప్రాయం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం నుంచి గత సమావేశంలో వచ్చింది. దీనికి తగ్గట్టుగా టెండర్లు ఏం పిలవాలి? టెండర్ల నిబంధనలకు సంబంధించి కూడా సమగ్రంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇంద్రకీలాద్రిపై అలంకరణ, అన్న ప్రసాదాల తయారీ వంటి అంశాలు చర్చకు రానున్నాయి. వీటితో పాటు దుర్గగుడి దిగువన మాస్టర్ ప్లాన్ తొలిదశలో భాగంగా చేపడుతున్న పనులను పరుగులెత్తించి, అందుబాటులోకి తీసుకురావటానికి వీలుగా ఇప్పటికే దేవదాయ శాఖ కమిషనర్ ఒక షెడ్యూల్ ను నిర్దేశించారు. ఈ షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన పనులకు సంబంధించి కూడా సమగ్రంగా సమీక్షించే అవకాశం కనిపిస్తోంది. దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించటంలో వివిధ శాఖల అవసరం కూడా ఉంది. శానిటేషన్‌కు సంబంధించి కార్పొరేషన్ సేవలు అందించాల్సి ఉంది. దేవస్థానానికి భక్తుల నుంచే ఆదాయం వస్తుంది. ఉత్సవాల సందర్భంలో దీనిని గమనంలోకి తీసుకుని కార్పొరేషన్, ఇతర శాఖలు తక్కువ ఖర్చుతో సేవలు అందించాలన్న అంశంపై కూడా చర్చ జరగనుందని తెలుస్తోంది. ఈ అంశాలన్నింటిపైనా సమగ్రంగా చర్చించి తగిన నిర్ణయాలను తీసుకునే అవకాశం ఉంది.

పీఏసీఎస్ ఛైర్మన్ల నియామకం



యెనిగళ్ల నాగేశ్వరరావుతో వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు

గుడ్లవల్లేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొమ్మిది ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిమన్ కమిటీ, అధ్యక్షులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుడ్లవల్లేరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా యెనిగళ్ల నాగేశ్వరరావు, డోకిపర్రు ఛైర్మన్‌గా చింతపల్లి శివారెడ్డి, చంద్రాలకు ఛైర్మన్‌గా జొన్నలగడ్డ సహదేవుడు, కౌతవరం ఛైర్మన్‌గా వడ్లమూడి యుగంధర్, పెంజంద్ర ఛైర్మన్‌గా బొప్పన శివప్రసాద్, శేరికల్వపూడి ఛైర్మన్‌గా అట్లూరి శ్రీరామచంద్రప్రసాద్, వడ్లమన్నాడు ఛైర్మన్‌గా ఆడపా వివిఎస్ చంద్రశేఖరబాబు, వెణుతురుమిల్లి ఛైర్మన్‌గా కొప్పినేని పిచ్చేశ్వరరావు, విన్నకోట ఛైర్మన్‌గా బండి రామకృష్ణలను నియమించారు. పమిడిముక్కల మండల పరిధిలో అగినపర్రు చింతమనేని కమలాకరరావు, అమీనపురం కరిమికొండ రవీంద్రబాబు, గోపువానిపాలెం యార్లగడ్డ పిచ్చేశ్వరరావు, హనుమంత పురం రాజులపాటి రామాంజనేయ ప్రసాద్, కపిలేశ్వరపురం తాతినేని బాబూరావు, మే దూరు గోపిశెట్టి మోహనరావు, పమిడిముక్కల మైనేని వెంకటనరేంద్రను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

రైతు రైలులో ఏపీ నుంచి 34 వేల టన్నుల పంటల రవాణా

» కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

వన్‌టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనార్థం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'రైతు రైలు' సేవలు ఆంధ్రప్రదేశ్ నుంచి విజయవంతంగా కొనసాగుతున్నాయి. 2020 ఆగస్టు 7 నుంచి ప్రారంభమైన రైతు రైలు' ఆంధ్రప్రదేశ్ నుంచి మొత్తం 116 సార్లు అస్సాం, బీహార్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, త్రిపుర రాష్ట్రాల వైపు నడిచాయి. తద్వారా ఇప్పటి వరకు 34,196 టన్నుల తాజా సరుకు, ప్రధానంగా అరటి, మామిడి, ఉల్లిపాయలు తదితర పంటలు తరలించినట్టు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. లోక్‌సభలో బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు కలిసి ఆంధ్రప్రదేశ్‌లో 'రైతు రైలు' సేవలపై కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖను ప్రశ్నించగా, మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కూరగాయలు, పండ్లు ఉత్పత్తి చేసే జిల్లాలను 'రైతు రైలు' సర్క్యూట్‌లో చేర్చడానికి రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్యశాఖలతో పాటు స్థానిక మార్కెట్ యార్డులు, మండీలతో సంప్రదింపులు జరిపినట్టు కేంద్ర మంత్రి తెలిపారు. డిమాండ్ ఉన్న ప్రదేశాలను గుర్తించి రవాణా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో రైతుల అవసరాలకు అనుగుణంగా కొత్త సర్క్యూట్‌లలో కూడా రైతు రైలు' సేవలు విస్తరించే అవకాశముందని మంత్రి స్పష్టం చేశారు.

కాసులిస్తేనే.. కనికరం!

(5వ పేజీ తరువాయి)

విద్య అనే విమర్శలు ఉన్నాయి. వివిధ ఫైళ్లను క్లియర్ చేసేందుకు ఈ ఉద్యోగి అనేక మెలికలు పెడతారని, మంత్రులు, శాసన సభ్యులతో చెప్పిస్తే మరిన్ని కొర్రీలు పెట్టి, మీ ఫైళ్లు ఆమోదానికి నోచుకోవాలంటే తాను అడిగినంత నగదును ఇవ్వాల్సిందేనని ముక్కు పిండి వసూలు చేస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు.

రైతులకు నగదు ఇవ్వకుండా జాప్యం!

మచిలీపట్నం పోర్టు వరకు రోడ్ కం రైలు మార్గాలకు రైతులు భూములు ఇచ్చారు. మేకావానిపాలేనికి చెందిన ఆరుగురు రైతులకు 2023 నుంచి నగదు ఇవ్వకుండా ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి చక్రం తిప్పుతున్నాడని ఆరోపణలు ఉన్నాయి. పూర్వ కాలంలో అన్నదమ్ములు పంచుకున్న భూములకు సంబంధించి పత్రాలు సక్రమంగా లేవనే కారణంతో నగదును ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలు పలుమార్లు ఆర్డీవో కార్యాలయంలో ఇస్తే ఈ పత్రాలు పనికిరావని ఇక్కడి ఉద్యోగి చెప్పడం గమనార్హం. ఆరుగురు రైతులకు నగదు ఇవ్వకుండా ఈ ఉద్యోగి తొక్కిపెట్టారు. దీంతో రైతులు తమ భూములను తీసుకుని అందులో రోడ్డు కూడా వేశారని, అన్నిపత్రాలు ఇచ్చినా, అవి సక్రమంగా లేవంటూ నగదు విడుదల చేయకుండా ఆర్డీవో కార్యాలయ ఉద్యోగి జాప్యం చేస్తున్నారని కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్‌కు నాపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ ఈ ఉద్యోగి తమపై విరుచుకుపడ్డాడని రైతులు కన్నీరుపెట్టుకున్నారు. రికార్డులు సక్రమంగా లేని భూములకు సంబంధించి నగదును కోర్టులో జమ చేస్తే, తమ వద్ద ఉన్న పత్రాలను చూపి నగదును తెచ్చుకునే ప్రయత్నం చేస్తామని రైతులు అంటున్నారు. నగదును కోర్టులో కూడా చెల్లించకుండా ఈ ఉద్యోగి తీవ్ర జాప్యం చేస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. రోడ్ కం రైలు మార్గానికి తీసుకున్న భూములకు సంబంధించి ఒకే కుటుంబానికి చెందిన వారికి రూ.1.25కోట్ల నగదును చెల్లించాల్సి ఉంది. ఈ భూములకు పత్రాలు సక్రమంగా లేవని, పెద్ద మొత్తంలో నగదు ఇస్తే మీపని పూర్తవుతుందని చెప్పి ఈ ఉద్యోగి, ఒక అధికారి తెరవెనుక బేరం పెట్టినట్లు సమాచారం. ఇంతపెద్ద మొత్తంలో నగదు ఇవ్వలేమని వారు చెప్పడంతో ఈ పని అవ్వకుండా తొక్కిపెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్డీవో కార్యాలయంపై జిల్లాస్థాయి అధికారులు నిఘా పెట్టి అక్రమాలకు పాల్పడుతున్న వారిని కట్టడి చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

మార్కెట్లోకి సరికొత్త రెనో ట్రైబర్

విజయవాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : భారత ఆటోమొబైల్ కార్లరంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని రెనో కంపెనీ కలిగి ఉందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చందన్ అన్నారు. విజయవాడలోని ఎనికేపాడులో గల రెనోలోని కొత్త మోడల్ ట్రైబర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రైబర్ మాడ్యులర్ డిజైన్, అధునాతన భద్రతా ప్రమాణాలు, మెరుగైన సౌకర్యం, స్టైయిలింగ్ వంటివాటితో ఈకాలం అవసరాలను తీర్చే విధంగా రూపుదిద్దబడిందన్నారు. కొత్త మోడల్ కారు ప్రారంభ ధర రూ.6.29 లక్షలుగా ఉందన్నారు. ఈ వెర్షన్ 4 మోడల్స్‌లో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ప్రవీణ్‌కుమార్, వ్యాపారవేత్త గోపాలకృష్ణ పాల్గొని కారును ఆవిష్కరించారు.



రెనో ట్రైబర్ కారు విడుదల చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చందన్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ప్రవీణ్‌కుమార్

పీఎన్‌బీఎస్‌లో నాసిరకం ఆహారపదార్థాలు

» ఫిర్యాదు చేసిన ప్రయాణికుడు

» తూతూమంత్రంగా ఫుడ్ సేఫ్టీ తనిఖీలు?

» ఫిర్యాదు చేసిన ప్రయాణికుడు

బస్‌స్టేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో పలువురు వ్యాపారస్తులు నాసిరకం ఆహారపదార్థాలను ప్రయాణికులకు విక్రయిస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే దుకాణ సిబ్బంది అసభ్యకరంగా దూషిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుధవారం ఓ ప్రయాణికుడు బస్‌స్టేషన్‌లోని సమాచార కేంద్రం సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో పరోటా తీసుకున్నాడు. తీసుకున్న పరోటా నాసిరకంగా ఉండటంతో హోటల్ సిబ్బందిని సదరు వ్యక్తి ప్రశ్నించాడు. దీంతో ఆ సిబ్బంది ప్రయాణికుడిని దూషించి బెదిరించినట్టు తెలిసింది. ఈ విషయమై ఆ ప్రయాణికుడు ఫుడ్‌సేఫ్టీ అధికారులకు సమాచారం తెలియపరిచాడు.

ఫుడ్ సేఫ్టీ అధికారి ఎస్.రవీంద్రా రెడ్డి హోటల్‌కు వెళ్లి తనిఖీలు చేశారు. హోటల్ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. పలువురు ప్రయాణికులు ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తూతా మంత్రంగా తనిఖీలు నిర్వహించారంటూ ఆరోపిస్తున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫుడ్ సేఫ్టీ అధికారిని వివరణ కోరగా, ఓ ప్రయాణికుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హోటల్‌లో తనిఖీలు నిర్వహించామని.. హోటల్‌లో ఆహారపదార్థాల నాణ్యత బాగుందని ఆ అధికారి చెప్పడం విశేషం.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 490	

వైభవంగా శ్రీకృష్ణ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

గన్నవరం(ఉంగుటూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం యాదవుల రామాలయం సమీపంలో శ్రీకృష్ణుని దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అన్నసంతర్పణ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు చిమటా గంగాధర్‌రావు, గన్నవరం జనసేన నాయకుడు చిమటా రవివర్మ, డిల్లీ సురేంద్ర బాబు, పిన్నిబోయిన శ్రీనివాసరావు, చిమటా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

బాపులపాడు ఎంఈవో-2గా వేలేరు హెచ్‌ఎం విజయ్

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బాపులపాడు మండల విద్యాధికారి-2గా వేలేరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె. విజయ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బి.సురేష్‌కుమార్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో విజయ్‌కు అదనపు బాధ్యత జిల్లా ఉన్నతాధికారులు అప్పగించారు.

ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్: ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో బీటీపీ మొదటి సంవత్సరం చదువుతున్న అప్పనవీడు గ్రామానికి చెందిన పేద విద్యార్థి చందన హేమంత్‌కు స్థానిక మానవత శాఖ రూ.5వేలు ఆర్థిక సాయం అందజేసింది. బుధవారం మానవత కార్యాలయంలో మానవత వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా సాయం అందజేశారు.

ప్రతి రోడ్డూ సీసీ రోడ్డుగా మారుస్తాం

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రానున్న నాలుగేళ్లలో తాడిగడప మునిసిపాలిటీలోని రోడ్లన్నింటినీ సీసీ రోడ్లుగా వేస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పోరంకి శ్రీనివాసనగర్‌లోని సాయిబాబా ఆలయం వద్ద రూ.20లక్షలు, యనమలకుదురు వాటర్‌ట్యాంకు వద్ద రూ.22లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. వచ్చే ఏడాదితో కలిపి మొత్తం రూ.150కోట్లతో తాడిగడప మునిసిపాలిటీని అభివృద్ధి చేసినట్టువుతుందని తెలిపారు. కానూరు పరిధిలో రూ.105కోట్లతో మూడు మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణానికి సీఆర్డీయే టెండర్లు పిలిచిందని, మునిసిపాలిటీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి రూ.9కోట్ల సీఆర్డీయే నిధులను ఖర్చు చేస్తున్నామని తెలిపారు. మునిసిపల్ కౌన్సిల్ ఎన్నిక పూర్తయితే 15వ ఆర్థికసంఘ నిధులు వస్తాయని, ఈ లోపు మునిసిపాలిటీకి ప్రజలు చెల్లించాల్సిన నీటి పన్ను బకాయిలను చెల్లించి సహకరించాలని అర్థించారు. కార్యక్రమాల్లో కమిషనర్ షేక్ నజీర్, టీడీపీ కూటమి నాయకులు వెలగపూడి శంకరబాబు, తుమ్మలపల్లి హరికృష్ణ, తాతపూడి గణేష్, తదితరులు పాల్గొన్నారు.


పోరంకిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి

కానూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమష్టి కృషితో, పటిష్ట భాగస్వామ్యంతో జిల్లాను బాలల స్నేహపూరిత జిల్లాగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి. పద్మావతి అన్నారు. బుధవారం కానూరులోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో బి. పద్మావతి అధ్యక్షతన జిల్లాకు సంబంధించి సమన్వయ సమావేశం జరిగింది. ప్రతిప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు, చిల్డ్రన్స్ కమిటీలు, ఈగల్ క్లబ్‌లు, యాంటీ ర్యాగింగ్ కమిటీలు, శక్తి కమిటీలు పటిష్ఠంచేసి ఫిర్యాదుల బాక్సులు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. అనాథ పిల్లలు, తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డీఈవో సుబ్బారావు, స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐవో ప్రభాకర్, డీసీపీవో రాజేశ్వరరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు రవి భార్గవ్, రమాదేవి, అబ్దుల్ రబ్బానీ, ఆశారాణితోపాటు సీడీపీవోలు, ఎంఈవోలు, పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి

మూడో రోజుకు ఆరోగ్య అవగాహన ప్రదర్శన

గన్నవరం(ఉంగుటూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చినవుటపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో జరుగుతున్న బుధవారం మూడో రోజు వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో కోలాహలంగా సాగింది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, ఆగిరిపల్లి మండలాల్లోని పాఠశాలలు, కళాశాల విద్యార్థులతోపాటు విజయవాడ పరిసరప్రాంతాల్లోని పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 3500మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కేవలం విద్యార్థులే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ఈ ఆరోగ్య అవగాహన ప్రదర్శనలో పాల్గొనవచ్చునని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేజర్ ఎంవీ భీమేశ్వరరావు తెలిపారు. అవయవాలు-వాటి పనితీరు. అవి సక్రమంగా పనిచేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీవీ రావ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కళ్యాణిశ్రీ, డాక్టర్ రాజగోపాల్, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎముకల పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న వైద్యులు

ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

● మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం ద్వారా యువత భవిష్యత్ నిర్మాణానికి మార్గం సుగమం అవుతుందని, నైపుణ్యాభివృద్ధికి ఈ రెండూ దారిదీపాలుగా నిలుస్తాయని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. విజయవాడ పర్యటనలో వున్న ఆయన బుధవారం ఉదయం ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లోని శిక్షణార్థులతో కలిసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్వయం సమృద్ధి మీద యువత దృష్టి కేంద్రీకరించాలని, ఉద్యోగం కోసం ప్రయత్నించడం కంటే నలుగురికి ఉద్యోగాలు అందించే విధంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా యువత మారాలని ఆకాంక్షించారు. ఇందుకోసం ఆయారంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. యువత పుస్తకపఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. యోగ, వ్యాయామం, పుస్తకపఠనం, ఆరోగ్యకరమైన ఆహారం, పెద్దలతో మాట్లాడటం జీవన విధానంలో భాగం కావాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణార్థుల కోరిక మేరకు వారితో కలిసి వెంకయ్య గ్రూప్ ఫొటో దిగారు.


శిక్షణార్థులతో కలిసి గ్రూప్ ఫోటో దిగిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ట్రూఅప్ చార్జీలతో ప్రజలపై భారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై ఆర్థికభారాన్ని మోపుతున్నారని సీపీఎం నాయకుడు భీమవరపు సుబ్బారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎ.సీతారాంపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం నిరసన చేపట్టి విద్యుత్ శాఖ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, ట్రూఆప్ చార్జీలను తక్షణం ఉపసంహరించాలని నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వ అవకాశవాద విధానాలను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఇదే విధానం కొనసాగిస్తే రాబోయే కాలంలో ప్రజలను కలుపుకుని ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అజ్మీర్, వెంకటేశ్వరరావు, బర్రె లెనిన్, పాల్గొన్నారు.

తల్లిపాలే శిశువుకు అమృతం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.సత్యవాణి

గన్నవరం(ఉంగుటూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలకు మించిన శ్రేష్ఠమైన ఆహారం మరొకటి లేదని, తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.సత్యవాణి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం గన్నవరం మండలం తెంపల్లి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సత్యవాణి తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలు, తల్లులకు వివరించారు. పుట్టినవెంటనే నవజాత శిశువుకు తప్పనిసరిగా తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు. అనంతరం గ్రామంలో తల్లిపాల విశిష్టతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, పీహెచ్‌ఎన్.వి.లక్ష్మీకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.


తల్లిపాల వారోత్సవాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణీలు

యనమలకుదురులో..

పెనమలూరు: కంకిపాడు ఐసీడీఎస్ పరిధిలోని యనమలకుదురు-17,19 అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డీ విజయక్ష్మి, బీ సునీత, ఎండీ హలిమా బీ, ఎం లక్ష్మి, పూర్ణ సంధ్యారాణి, డీ జయశ్రీ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.సత్యవాణి

వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

● సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి

గన్నవరం(ఉంగుటూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఆహార(ఫుడ్)కమిషన్ ఛైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం తన సిబ్బందితో కలిసి గన్నవరం మండలంలోని పలు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. గన్నవరం ప్రభుత్వ సాంఘికసంక్షేమ బాలుర వసతి గృహం, దావాజీగూడెంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, మోడల్ వసతి గృహం, గన్నవరం ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహం, కళాశాల బాలికల వసతి గృహాలు సందర్శించి నిల్వచేసిన ఆహార పదార్థాలు, సరుకులను పరిశీలించారు.ఈకార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మోహన్‌రావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.శివరామ్‌ప్రసాద్, సాంఘికసంక్షేమశాఖ ఉపసంచాలకులు షేక్ షాహిద్ బాబు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి జి.రమేష్, గిరిజన సంక్షేమశాఖ అధికారి ఫణి ధూర్జటి, డీఈవో పీవీజే రామారావు, వివిధ వసతి గృహాల అధికారులు, మొవ్వల ఇశ్రాయేలు, ప్రకాష్, శోభ, జేవీఎన్ లక్ష్మి, డి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పెరికీడులోని రేషన్ దుకాణాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని, కానుమోలు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె.రామారావు, సివిల్ సప్లయిస్ డీఎం శివరాంప్రసాద్, పౌరసరఫరాలశాఖ డీఎస్‌వో మోహనరావు, తదితర అధికారులతో కలిసి రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ సిహెచ్ విజయప్రతాపరెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె. రామారావు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి, పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనే ధ్యేయం

● హెచ్‌ఎస్ ఏ.నాగమల్లేశ్వరరావు

గన్నవరం(ఉంగుటూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి బిడ్డను నులిపురుగుల బారి నుంచి రక్షించడమే ధ్యేయంగా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆత్కూరు పీహెచ్‌సీ హెచ్‌ఎస్ ఏ.నాగమల్లేశ్వరరావు తెలిపారు. అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సంవత్సరం నుంచి 19ఏళ్లలోపు వయసున్న పిల్లలందరికీ ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నట్లు తెలిపారు. బుధవారం తెంపల్లి అంగన్వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న ఆయన ఆరోగ్యసిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవాణి, పీహెచ్‌ఎన్ వి.లక్ష్మీకుమారి, అంగన్వాడీ, ఆరోగ్యసిబ్బంది, కిశోరబాలికలు, పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీ, ఆరోగ్యసిబ్బంది

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

గన్నవరం(ఉంగుటూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పుణ్యా చారిటీస్ అధినేత, చినవుటపల్లి రోటరీ క్లబ్ సెక్రటరీ రొటేరియన్ జాస్తి విజయభూషణ్‌కుమార్ బుధవారం కేసరపల్లికి చెందిన పేద విద్యార్థుల చదువు నిమిత్తం రూ.10వేల ఆర్థికసాయమందించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేసరపల్లి శాఖలో దినసరి వేతనంపై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీదేవి పిల్లల చదువుకు ప్రోత్సాహకంగా ఆర్థిక సాయమందించినట్లు తెలిపారు. గన్నవరం రోటరీ క్లబ్ అధ్యక్షులు రొటేరియన్ జీవీ రవిబాబు, కార్యదర్శి రొటేరియన్ కే.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో మూడు పీఏసీఎస్‌లకు త్రిసభ్యకమిటీల నియామకం

గన్నవరం(ఉంగుటూరు), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలంలోని మూడు పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. సూరంపల్లి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా గొట్టిపూళ్ల వీరబాబు, పర్సన్లుగా బాణావత్ బాలనాయక్, రామినీడు బసవపూర్ణయ్య, పురుషోత్తపట్నం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా గుమ్మడి విజయలక్ష్మి, పర్సన్లుగా తాడిశెట్టి శ్రీనివాసరావు, కొండపల్లి శ్రీనివాసరావు, గోపవరపుగూడెం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌గా వేమూరి రవి, పర్సన్లుగా దేవరపల్లి చింపిరయ్య, కొలుసు రాణిలను ప్రభుత్వం నియమించింది

పీఏసీఎస్‌లకు ఛైర్‌పర్సన్‌ల నియామకం

ఉయ్యూరు: మండల పరిధిలో మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఛైర్‌పర్సన్‌లను ప్రభుత్వం నియమించింది. బోళ్లపాడుకు గుంటక లక్ష్మారెడ్డి, గండిగుంటకు దండమూడి వెంకటనాగేశ్వరరావు, కలవపాములకు కలపాల మల్లేశ్వరరావును ఛైర్‌పర్సన్‌లుగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

యథేచ్ఛగా ఆక్రమణలు

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆక్రమణలు
● ఆక్రమణదారులకు ప్రజా ప్రతినిధుల అండ
● వాహనాలు నిలిపేందుకు ఖాళీ లేక ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి - ఉయ్యూరు) : ఉయ్యూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రహరీ వెంబడి ఆక్రమణలతో కార్యాలయం కన్పించకుండా పోతోంది. ప్రహరీ వెంబడి ఫుట్‌పాత్‌ను ఆక్రమించి రేకుల షెడ్లు నిర్మించిన కొందరు ఇతరులకు అద్దెకిచ్చి వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. ఫుట్‌పాత్ దాటి రోడ్డు మీద వరకు వచ్చి కార్యాలయ గేటుకు ఇరువైపులా ఆక్రమించడంతో రిజిస్ట్రేషన్ కొరకు వచ్చేవారితో పాటు సాక్షి సంతకాలు చేసేందుకు వచ్చేవారు ప్రధానరోడ్డు మీద వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కొందరు కార్యాలయం ఆవరణలో ద్విచక్రవాహనాలు నిలపడంతో లోనికి వెళ్లేందుకు, బయట వేచి ఉండేందుకు అవకాశం లేక ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిదుల అండతో యధేచ్ఛగా ఆక్రమించుకోవడంతో రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఏమి అనలేని స్థితిలో మిన్నకుంటున్నారు. కార్యాలయానికి రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ఉయ్యూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాలకు చెందిన ప్రజలు అనునిత్యం వస్తుంటారు. ఈ నేపథ్యంలో కార్యాలయం వద్ద ఆక్రమణలతో వాహనాలు నిలిపే చోటు లేక ఇబ్బంది పడుతున్నారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి ఆక్రణలపై చర్యలు తీసకోవాలని కోరుతున్నారు.


ఉయ్యూరు సబ్‌రిస్ట్రార్ కార్యలయం ప్రహరీ వెంబడి ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు



రావయ్యా..లంబోధర!

చవితి పందిళ్లకు గణనాథుల విగ్రహాలు సిద్ధం!

● కళకళలాడుతున్న నున్న మ్యాంగో మార్కెట్

● అడుగు నుంచి 12 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు

విజయవాడ రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మరో మూడు వారాల్లో అంగరంగ వైభవంగా జరగనున్న వినాయక చవితి వేడుకలకు గణనాథులు సిద్ధమవుతున్నారు. చుట్టుపక్కల 10 జిల్లాల్లో చవితి పందిళ్లల్లో కొలువుతీరనున్న గణపయ్య విగ్రహాల తయారీకి నున్న మ్యాంగో మార్కెట్ ప్రాంగణం వేదికగా మారింది. గతంతో పోలిస్తే ఇక్కడ విగ్రహాల నాణ్యత, తయారీ విధానం మెరుగుపడటంతో పందిళ్ల నిర్వాహకులు విగ్రహాలను ఇక్కడి నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్లేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. దీంతో మార్కెట్ ప్రాంగణం 4 రోజులుగా కళకళలాడుతోంది. పందిళ్ల నిర్వాహకుల తాకిడితో వ్యాపారులు రెట్టించిన ఉత్సాహంతో విగ్రహాల తయారీలో తలమునకవుతున్నారు.



కోల్‌కతా, హైదరాబాద్ శైలిలో..

గతంలో నున్న మ్యాంగో మార్కెట్‌లో సాదాసీదా విగ్రహాలు మాత్రమే ఉండేవి. ఇద్దరు ముగ్గురు వ్యాపారస్థులు విగ్రహాల అమ్మకాలు జరిపేవారు. దీంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చవితి పందిళ్ల నిర్వాహకులు హైదరాబాద్ వెళ్లి విగ్రహాలు కొనుగోలు చేసేవారు. అయితే ప్రస్తుతం ఇక్కడ పరిస్థితులు మారిపోయాయి. కలకత్తా, హైదరాబాద్ శైలిలో విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. దీంతో గతంలో 2, 3 ఉండే తయారీ పరిశ్రమలు నేడు 25 వరకు పెరిగాయి. దీంతో అనేక మంది ఇక్కడ విగ్రహాలు కొనుగోలుకు ముందుకు వస్తున్నారు.

మహారాష్ట్ర, గుజరాత్ నుంచి కళాకారులు

విగ్రహాల తయారీదారులు మహారాష్ట్ర, గుజరాత్ నుంచి కళాకారులను తీసుకువచ్చి విగ్రహాలను రూపొందిస్తున్నారు. కూలీలు కూడా ఆయా రాష్ట్రాల నుంచే 2 నెలలు ముందుగా వచ్చి తయారీలో నిమగ్నమయ్యారు. కాంట్రాక్ట్ పద్ధతిలో కళాకారులు వినియోగదారులను ఆకట్టుకునేలా విగ్రహాలను రూపొందిస్తున్నారు.

అనేక రూపాల్లో గణపయ్య

కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు తయారీదారులు వివిధ రూపాల్లో విగ్రహాలను రూపొందించడమే కాకుండా విగ్రహాలకు సింహ గణపతి, దర్బార్ గణపయ్య, సాగరకన్య గణపయ్య, సూర్య గణపతి, ఓం గణపతి, లడ్డూ గణపయ్య వంటి రకరకాల పేర్లతో విగ్రహాలను రూపొందిస్తున్నారు. పేర్లకు తగ్గట్టుగానే విగ్రహాలుండటంతో కొనుగోలుకు డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో అడుగు నుంచి 12 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. ఎత్తును బట్టి వ్యాపారులు ధరను నిర్ణయిస్తున్నారు. రూ. 1500 నుంచి రూ. లక్ష వరకు విగ్రహాల ధరలు పలుకుతున్నాయి.

వివిధ జిల్లాల నుంచి వచ్చి కొనుగోళ్లు

ప్రస్తుతం నున్న మ్యాంగో మార్కెట్ విగ్రహాల అమ్మకాలకు కేంద్రంగా మారింది. పలు జిల్లాల నుంచి పందిళ్ల నిర్వాహకులు మార్కెట్‌కు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లా పరిసర ప్రాంతాల నుంచే కాక రాజమండ్రి, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, పలాస తదితర నగరాల నుంచి కూడా విగ్రహాల కొనుగోళ్లకు పందిళ్ల నిర్వాహకులు వస్తున్నారు.



25 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా మోహనరావు, వ్యాపారి

మేము 25 ఏళ్లగా విగ్రహాల వ్యాపారం చేస్తున్నాం. గతంతో పోలిస్తే ఇప్పుడు అమ్మకాలు పెరిగాయి. గతేడాది బుడమేరు వరదల కారణంగా నష్టపోయాం. ఈ ఏడాది వ్యాపారం బాగుంటుందని గణపతిని ప్రార్థిస్తున్నాం.

అందుబాటులో కోల్‌కతా మోడల్స్ తిరుపతినాయుడు వ్యాపారి



మార్కెట్‌లో కలకత్తా స్టైల్‌లో విగ్రహాలను రూపొందించి విక్రయిస్తున్నాం. రాజమండ్రి, పలాస నుంచి ఎక్కువగా వినియోగదారులు వస్తున్నారు. విగ్రహాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని అడ్వాన్స్‌లు ఇచ్చి వెళ్తున్నారు.



కాంట్రాక్టు పద్ధతిలో తయారు చేస్తున్నాం విష్ణు, మహారాష్ట్ర కళాకారుడు

విగ్రహాల తయారీకిగాను 2 నెలల క్రితం మహారాష్ట్ర నుంచి వచ్చాం. కాంట్రాక్ట్ పద్ధతిలో విగ్రహాలు రూపొందిస్తున్నాం. విగ్రహాల తయారీ దాదాపు పూర్తయి తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి.

మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దుదాం

● అన్ని విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు ● డిజిటల్ కంటెంట్‌తో పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారం దిశగా పయనిస్తూ దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేక్రమంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ సమన్వయం, నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన సదస్సుల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలపై బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈగల్ క్లబ్స్‌తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను కీలకపాత్ర పోషించేలా చూడాలన్నారు. స్వల్ప నిడివి గల ఆడియో, వీడియో ప్రదర్శనలు, పీపీటీ ప్రజెంటేషన్, సందేహాల నివృత్తి, ఇంటరాక్షన్ వంటి వాటితో అరగంట కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

నషా ముక్త్ భారత్ ఐదేళ్ల ప్రయాణం

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ 2020, ఆగస్టు 15న నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ)ను ప్రారంభించిందని, ఇప్పటికి ఐదేళ్లు అవుతున్న సందర్భంగా ఈనెల 1 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి సే నో టు డ్రగ్స్, డ్రగ్స్ వద్దు, స్కిల్స్ ముద్దు, ఈగల్ టోల్ ఫ్రీ నెంబరు 1972, ఈగల్ క్లబ్స్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, ఏసీపీలు కే వెంకటేశ్వరరావు, కే లతా కుమారి, ఈగల్ ఎస్ఐ ఎం వీరాంజనేయులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ఇగ్నైట్ సెల్ సందర్శన

విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడకుండా అన్నదాతలకు అవగాహన కల్పించాలని, పంట నాణ్యత, ఉత్పత్తిని పెంచడంతో పాటు డబ్బును, సమయాన్ని ఆదా చేసే నానో ఎరువులపై అన్నదాతలకు అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. కనీస మద్దతు ధరలు, ఏపీ మార్క్‌ఫెడ్ రైతులకందిస్తున్న సేవలు, సీఎం ఎయిడ్, సీఎం యాప్, మార్క్ రే ఈ ఆక్షన్ ప్లాట్‌ఫాం తదితర వివరాలతో రూపొందించిన పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. నానో యూరియా, నానో డీఏపీ, నానో జింక్, నానో కాపర్ ఎరువుల బాటిళ్లను పరిశీలించారు. మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కే నాగమల్లిక, మార్క్‌ఫెడ్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, వివిధ శాఖల ఉన్నతాధికారులు

పీ4 మార్గదర్శిగా అమరావతి ఐ హాస్పిటల్

పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా అమలుచేస్తున్న పీ4లో మేము సైతం అంటూ వ్యక్తిగతంగా కొందరు, సంస్థల పరంగా మరికొందరు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. తాజాగా నగరంలోని పుష్పా సెంటర్‌లో గల అమరావతి ఐ ఆసుపత్రి ముందుకొచ్చింది. ఈ మేరకు హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శైలజ కేతినేని కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశను కలిసి ప్రతిజ్ఞా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్గదర్శిగా అందించే చేయూతతో ఓ పేద కుటుంబం ఎదిగితే అప్పుడు కలిగే ఆనందం వెలకట్టలేదని భావించి ముందుకొచ్చిన అమరావతి ఐ హాస్పటల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. అమరావతి ఐ హాస్పిటల్ బ్రాంచ్ హెడ్ పీ కోటిరత్నం పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బీ పద్మావతి బుధవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకొంటున్న ప్రణాళికాయుత చర్యలను తెలిపారు. మిషన్ వాత్సల్య పథకం పటిష్ఠ అమలుపై సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు వాటి ఫలాలు బాలలకు పూర్తిస్థాయిలో అందేలా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ బి.పద్మావతిని సత్కరించారు. డీఆర్ఓ ఎం లక్ష్మీ నరసింహం, స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీసీపీవో ఎం రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

స్వచ్ఛమైన తాగునీటిని పొందడం ప్రజల హక్కు అని, ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా తాగునీటి సరఫరాలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉన్నామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో నీటి వనరులు, తాగునీటి సరఫరా వ్యవస్థలపై చర్చించి గుర్తించిన సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా 104 ఆవాసాలకు తాగునీటిని అందించే మైలవరం సమగ్ర రక్షిత మంచినీటి (సీపీడబ్ల్యు) పథకంతో పాటు జిల్లాలోని మొత్తం 19 సీడీడబ్ల్యు పథకాల ద్వారా నిరంతరం తాగునీటి సరఫరాలో సమస్యలు ఎదురుకాకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. జెడ్పీ సీఈవో కే కన్నమనాయుడు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్ విద్యాసాగర్, డీఈ వీ రవికుమార్, ఏఈ దయానంద్, కాంట్రాక్టర్ వీ రామారావు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య ప్రగతి సూచికలపై దృష్టిపెట్టండి

సుసంపన్న, ఆరోగ్య ఆనంద ఆంధ్ర సాకారానికి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం కీలకమని, అన్ని అంశాల్లోనూ నిరంతర ప్రగతి ముఖ్యమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆర్యోగం, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన స్వర్ణాంధ్ర విజన్ - కీలక ప్రగతి సూచికలు (కేపీఐ)పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 శాఖలకు సంబంధించి 523 కీలక ప్రగతి సూచికలున్నాయని, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమానికి మొత్తం 51 సూచికలు ఉన్నాయన్నారు. ఈ సూచికల్లో ప్రగతి మొత్తం జిల్లా అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సీపీవో వైశ్రీలత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జే ఇందుమతీ దేవి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో

శునకానికి అరుదైన శస్త్రచికిత్స

● మూత్రాశయం నుంచి 267 రాళ్లు తొలగింపు

● విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ కామని బృందం




శస్త్రచికిత్స అనంతరం శునకం, చిత్రంలో రాళ్లు

కృష్ణలంక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంకకు చెందిన కేఎల్‌యూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రేఖపల్లి లీల మూడేళ్లున్న సిజూ బ్రీడ్ పెంపుడు కుక్కను పెంచుకొంటున్నారు. ఇది కొంతకాలంగా మూత్రం ఎర్రగా పోయడం, మూత్ర విసర్జన సమయంలో బాధపడుతుండటం, ఆహారం తీసుకోకపోవడాన్ని గుర్తించి ఓ ప్రైవేటు వెటర్నరీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వారు వ్యాధిని గుర్తించకపోవడంతో తీవ్రత పెరిగింది. దీంతో ఆమె ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల గురించి తెలుసుకొని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు వద్దకు తీసుకొచ్చారు. ఆయన వెంటనే ఆపరేషన్ చేయాలని తొలిరోజే గుర్తించి చెప్పారు. రక్తపరీక్షలు, స్కానింగ్ అనంతరం ఆపరేషన్ చేసి మూత్రాశయం నుంచి 267 రాళ్లను తొలగించారు. అనంతరం కుక్కను డిశ్చార్జి చేశారు.

ప్రైవేటు వైద్యుల కంటే మిన్నగా స్పందించారు: డాక్టర్ రేఖపల్లి లీల

మా పెంపుడు కుక్కకు మూత్ర విసర్జన ఇబ్బందిగా ఉంటే ప్రైవేటు వైద్యులకు చూపించామని, వారు రోగాన్ని సరిగ్గా గుర్తించలేకపోయారని లీల తెలిపారు. వెంటనే ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు తీసుకురాగా డాక్టర్ కామని శ్రీనివాసరావు స్పందించి కుక్కకు ఆపరేషన్ చేశారన్నారు. ఇప్పుడు మా కుక్క చక్కగా ఆడుకొంటూ హుషారుగా ఉందంటూ వైద్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు.

వాటర్ కింగ్ విన్యాసాలు



ఎండ తాకిడికి తట్టుకోలేక ఓ అరుదైన పక్షి కాసేపు కృష్ణానదిలో మునుగుతూ, మరి కాసేపు ఒడ్డుకు వచ్చి సేదతీరుతూ చేసిన విన్యాసాలు అటుగా వెళ్లే పాదచారులను ఆకర్షించింది. తెలుపు, నలుపు మచ్చలతో వింతగా ఉన్న ఈ పక్షి పేరు వాటర్ కింగ్ ఫిషర్. ఇది అరుదుగా మాత్రమే కనిపిస్తుంది - ఆంధ్రజ్యోతి, విజయవాడ



మంత్రి రామనారాయణరెడ్డిని సత్కరిస్తున్న సంఘ నేతలు

ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

● దేవదాయ శాఖ మంత్రి ఆనంకు వినతి

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రధాన ఆలయాల ఎన్ఎంఆర్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు కోరారు. బుధవారం వెలగపూడిలోని సెక్రటేరియట్‌లో మంత్రి రామనారాయణ రెడ్డిని ఆయన చాంబర్‌లో సంఘం నేతలు కలిసి సమస్యలు విన్నవించుకుని వినతి పత్రం అందజేశారు. సుమారు 30 ఏళ్లుగా ఎన్ఎంఆర్ ఉద్యోగులు ప్రధాన ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్నామని తమను జీవో నెం 114 ద్వారా రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్రంలోని కాణిపాకం, శ్రీకాళహస్తి, పెనుగంచిప్రోలు, శ్రీశైలం, ద్వారకా తిరుమల, విజయవాడ, సింహాచలం, అన్నవరం దేవస్థానాల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగులు చాలీ చాలని వేతనాలతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు ఎన్వీ రమణ ఆధ్వర్యంలో సంఘం నేతలు, ఎన్ఎంఆర్ ఉద్యోగులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా

విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్

పునరుద్ధరణ హర్షణీయం

● హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా

లబ్బీపేట స్పోర్ట్స్, 6 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను తిరిగి పునరుద్ధరించడంలో చొరవ చూపిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా ధన్యవాదాలు తెలిపారు. లబ్బీపేటలోని హజ్ కమిటీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సెంట్రల్ హజ్ కమిటీ 2550 మందికి హజ్ యాత్రకు అవకాశం కల్పించిందన్నారు. గతేడాది విజయవాడ నుంచి పవిత్ర మక్కా యాత్రకు దరఖాస్తు చేసుకున్న 72 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున కూటమి ప్రభుత్వం అందించడం హర్షణీయమన్నారు. ఈ ఏడాది మక్కా యాత్రకు వెళ్లే యాత్రికులకు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను ఎంపిక చేసుకోవాలని కోరారు. అలా చేస్తే ప్రభుత్వం రూ.లక్ష అందజేస్తుందన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను నిలబెట్టుకోవాలంటే యాత్రికులు పెద్ద సంఖ్యలో విజయవాడ నుంచి పవిత్ర మక్కా యాత్రకు బయలుదేరాలన్నారు. హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ హుస్సేన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ సాధించి చూపించిందన్నారు. హబీబుల్లా, మహమ్మద్ సాజి పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న సంస్థ డైరెక్టర్స్ అర్జున్, ఆనంద్

ఘనంగా ఎన్ఏసీ విజయవాడ బ్రాంచి పదో వార్షికోత్సవం

లబ్బీపేట, ఆంధ్రజ్యోతి: వినియోగదారుల మన్ననలు పొందుతూ తమ సంస్థ విజయవాడ బ్రాంచి పదేళ్లు పూర్తిచేసుకోవడం సంతోషంగా ఉందని ఎన్ఏసీ జ్యూయలరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ అర్జున్ వరదరాజన్, ఆనంద రామానుజన్ అన్నారు. బందర్ రోడ్డులోని ఎన్ఏసీ జ్యూయలరీ పదేళ్ల వేడుకలను షోరూంలో ఇటీవల వినియెగదారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాంచి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా షోరూమ్ ఆధునికీకరణతోపాటు ప్రత్యేక ఆఫర్లు అందజేస్తున్నామన్నారు. తమ సంస్థ ఇన్నేళ్లు విజయవంతంగా నిర్వహించడానికి తమ వినియోగదారుల ప్రోత్సాహమేనని వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. పలువురు కస్టమర్లు, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.



మూసివేతకు సిద్ధంగా ఉన్న ఎంపీపీ-3 పాఠశాల

ఒకే విద్యార్థి.. మూసివేతకు సిద్ధంగా పాఠశాల

మైలవరం రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మైలవరంలోని ఎంపీపీ-3 పాఠశాల మూసివేతకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం పాఠశాలలో ఒకే ఒక విద్యార్థి ఉన్నాడు. గత ప్రభుత్వం 2021లో తీసుకున్న నిర్ణయాల వల్ల 3,4,5 తరగతులు ఇతర పాఠశాలల్లో కలిపేశారు. దీంతో పాఠశాలలో ఈ సంవత్సరం కొత్త అడ్మిషన్లు జరగలేదు. విద్యార్థుల సంఖ్య తగ్గి ఒక విద్యార్థి మాత్రమే మిగిలాడు. ప్రస్తుత నిబంధనల ప్రకారం 10 మంది విద్యార్థులు లేకపోతే పాఠశాల మూసివేసే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ విద్యార్థులు లేక స్కూల్ మూసివేసే పరిస్థితి రావడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. నిబంధనలను సడలించి పాఠశాల మూతపడకుండా చూడాలని ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎక్స్‌కవేటర్ బకెట్ తగిలి ఒకరు మృతి



కోడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఎక్సకవేటర్ బకెట్ తగిలి ఒకరు మృతి చెందిన సంఘటన కోడూరు మండల పరిధిలోని మందపాకల - చింగకోళ్ల రహదారిపై చోటు చేసుకుంది. రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా సైడ్ మార్జిన్ పనులు చేస్తున్న ఎక్సకవేటర్ బకెట్ తగిలి అటుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మందపాకల గ్రామానికి చెందిన గాదె చలపతిరావు (43) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గాదె ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ చాణిక్య తెలిపారు.



కొండపల్లిలో ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బాధితురాలి బంధువు ఒడిలో మృతి చెందిన శిశువు

ప్రైవేటు వైద్యుల నిర్లక్ష్యంతో

పుట్టిన అరగంటకే బిడ్డ మృతి

● ఆందోళనకు దిగిన బాధిత కుటుంబ సభ్యులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వైద్యుల నిర్లక్ష్యంతో అప్పుడే పుట్టిన ఓ బిడ్డ మృతి చెందింది. కొండపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఈ ఘటన ఆదివారం జరిగింది. మూలపాడు గ్రామానికి చెందిన గర్భిణి మర్సకట్ల శ్రావణి (25) డెలివరీ నిమిత్తం కొండపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరింది. వైద్యులు డెలివరీ చేశారు. నార్మల్ డెలివరీ అనంతరం బిడ్డ పుట్టిన అర్ధగంట తర్వాత చనిపోయింది. దీంతో శ్రావణి కుటుంబ సభ్యులు బిడ్డ ఎందుకు చనిపోయిందని వైద్యులను నిలదీశారు. సిబ్బంది దురుసుగా సమాధానం చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. చేయాల్సిన వైద్యులచే కాకుండా వైద్యం రాని వారితో డెలివరీ చేయించడం వల్లే బిడ్డ చనిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. న్యాయం జరిగే వరకు అక్కడి నుంచి వెళ్లేది లేదని శ్రావణి కుటుంబ సభ్యులు పట్టుబట్టారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 490

కొండాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

గుడ్లవల్లేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయ హుండీలు బుధవారం లెక్కించారు. కాగా 41 రోజులకు భక్తులు అమ్మవారికి రూ. 17.75 లక్షలు కానుకలుగా సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. కాగా 27 గ్రాముల బంగారం, 1.206 కేజీల వెండినీ భక్తులు కానుకల రూపంలో హుండీలో ఉంచారని ఆయన తెలిపారు. గ్రేడ్ -1 కార్యనిర్వహణాధికారి అరుణ పర్యవేక్షణాధికారిగా హుండీ లెక్కింపులకు వ్యవహరించారని ఈవో తెలిపారు. బుధవారం కొండలమ్మ అమ్మవారిని రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ గురుమూర్తిలు దర్శించుకున్నారు.

సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం స్థాక ఐఎంఏ హాల్లో ప్రజాసమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై పురపాలక సంఘ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ ప్రజాసమస్యలను మరింత పారదర్శకంగా పరిష్కరించేందుకే సమావేశాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఉద్యోగుల ఇబ్బందులను తనవిగా భావించి వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు, పథకాల అమలులో తలెత్తుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగులు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ సింహాద్రి మనోహర్ ఎమ్మెల్యేకు సూచించారు. సచివాలయ కార్యదర్శులకు ఎమ్మెల్యే వెనిగండ్ల పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ గురుమూర్తి, జనసేన ఇన్‌చార్జ్ శ్రీకాంత్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ప్రసాద్, పాల్గొన్నారు.

గుడివాడ : నియోజకవర్గంలో క్రైస్తవులకు సమాధులకు స్థలం లేక మరణించిన వారిని పూడ్చిన కొద్దిరోజులకు తీసేసి అదే స్థలంలో మరో భౌతికకాయాన్ని పూడ్చాల్సిన దుస్థితి ఏర్పడిందని, వెంటనే క్రైస్తవుల సమాధులకు స్థలం కేటాయించాలని ఆంధ్ర ప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ గుడివాడ డివిజన్ పాస్టర్లు కోరారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వగృహంలో ఎమ్మెల్యే వెనిగండ్లకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి నియోజకవర్గంలో క్రైస్తవుల సమాధులకు 5ఎకరాల స్థలం కేటాయించేలా కృషి చేస్తానని హామీ యిచ్చారు. పాస్టర్ల సంఘం గౌరవాధ్యక్షుడు బిషప్ జాషువా, జి.శ్యాంబాబు, జి.ఏ శేఖర్, ఇ.రత్నకర్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనగండ్ల, పక్కన రావి

గుడ్లవల్లేరు : రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉండే విధంగా వ్యవసాయాధికారులు సహకరించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం రాత్రి గుడ్లవల్లేరు ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి రవి సారథ్యంలో ప్రజావేదికలో ఎమ్మెల్యేని కలసి యూరియా కొరతపై తమ గోడు వెలిబుచ్చారు. కాగా శనివారం నాటికి యరియాను దిగుమతి చేయించి సోమ,మంగళవారాల లోపు పంపిణీ చేయిస్తామని మండల వ్యవసాయాధికారి సునీల్ ఎమ్మెల్యేకు వివరించారు. అలానే గుడివాడ ఏవో బి.అనంతలక్ష్మి, నందివాడ ఏఓ ఎన్.భానుప్రకాష్ ఎన్.భానుప్రకాష్ లతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఏపీఎస్‌డబ్ల్యూసీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రవికుమార్, గుడ్లవల్లేరు పీఏసీఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో ఆందోళన చెందొద్దు

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సాగుకు రైతులకు అవసరమైన యూరియా, కాంప్లెక్సు ఎరువుల సరఫరాలో ఎటువంటి ఆందోళన చెందనవసరంలేదని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పామర్రులో గ్రోమోర్ ఎరువుల స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని పంటలకు సరిపడిన మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. పంటలకు అవసరమైన మోతాదులో మాత్రమే ఎరువులను వాడుకోవాలని సూచించారు. అధిక యూరియా వేయడం వల్ల పంటల దిగుబడి పెరుగుతుందనేది అపోహగా భావించాలన్నారు. అధిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుందని గ్రహించాలన్నారు. సంబంధిత దుకాణంలో స్టాక్ బోర్డుతోపాటు యూరియా ,డీఏపీ అమ్మకానికి సంబంధించిన రసీదులను పరిశీలించి, ప్రతి అమ్మకానికి చెందిన రశీదును రైతులకు ఖచ్చితంగా అందించాలని దుకాణ ఉద్యోగులకు చెప్పారు. ఎరువుల దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు పంపిణీ చేసిన ప్రభుత్వానికి ఎరువుల అందించలేకపోతుందనే మచ్చ రాకుండా చూడవలిసిన బాధ్య త వ్యవసాయాధికారుల దేనని ఆదేశించారు. ఈ తనిఖీల్లో పామర్రు వ్యవసాయశాఖ ఏడీఏ బి.స్వర్ణలత, ఏవో వి.శివనాగరాణి, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ వల్లూరిపల్లి గణేష్, పాల్గొన్నారు.


పామర్రులోని ఎరువుల దుకాణంలో స్టాకు రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

కూచిపూడి: ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని ఎరువుల దుకాణదారులు సక్రమంగా ఎరువులు అందించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వలోని ఎరువుల దుకాణాన్ని బుధవారం ఆయన పరిశీలించి ఏ రకమైన ఎరువులు ప్రస్తుతం రైతులకు అవసరంగా ఉంది. ఎంత మేర దుకాణాల్లో నిల్వ ఉంది? వాటి ధరలు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం రైతులను అడిగి పలు విషయాలు సేకరించారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

కూచిపూడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేద వర్గాల ప్రజలకు వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి అందించటం గొప్ప వరమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పెదపూడికి చెందిన రాయన వీరదుర్గ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కూటమి నేతలతో కలసి ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాతా ప్రభాకర్‌రావు, వీరంకి తులసీదాస్, రామిశెట్టి రాజీవ్ ప్రసాద్, తాతా శివాజీ, మురారి పూర్ణచంద్ర రావు, తాతా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

● సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి

గుడివాడ/గుడివాడ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మోటూరులోని డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్య ధోరణి పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత వంట గదిని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 1.15 అవుతున్న వంట సిద్ధం కాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. 590మంది విద్యార్థులకు ఇద్దరే వంట మనుషులుండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ప్రిన్సిపాల్ వి.విజయలక్ష్మి సమాధానమిస్తూ ఎమ్మెల్యే సిఫారసు మేరకు కొందరిని నియమించుకున్నామని, వారు విధులకు హాజరు కావడం లేదని సమాధానమిచ్చారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ప్రిన్సిపాల్ పర్యవేక్షణ లోపం కారణంగా గడువు ముగిసిన కారంపొడి, పసుపు ప్యాకెట్ లాంటి వస్తువులను వినియోగిస్తున్నారన్నారు. వెంటనే గడువు ముగిసిన వస్తువులను వెంటనే బయట పడేయాలని ఆదేశించారు. అనంతరం 9,10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. గుడివాడలోని బేతవోలు ఉన్నత పాఠశాల, మూడు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జి.మోహనరావు,టి.శివరాంప్రసాద్, రాణి, జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె రామారావు, తహశీల్దార్ కిరణ్, డిప్యూటీ తహశీల్దార్ రామశేషు, మండల విద్యాశాఖాధికారి బాలాజీ, పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గృహ నిర్మాణ లక్ష్యాలను అధిగమించాలి

● ఎస్.పోతురాజు

పామర్రు, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వ పథకం ద్వారా నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను గ్రామాల్లో వేగవంతంగా పూర్తిచేయించి, ఆగస్టు 25న రాష్ట్రవ్యాప్తంగా జరగబోయే సా మూహిక గృహప్రవేశాలకు లబ్ధిదారులను సన్నద్ధం చేసే బా ధ్యత సంబంధిత క్షేత్రస్థాయి అధికారులదేనని జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్ ఎస్.పోతురాజు అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి హౌసింగ్, ఇంజనీరింగ్ అధికారులతో పేదల గృహనిర్మాణల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంజనీరింగ్ అధికార సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను అధిగమించేందుకు నిర్ధేశించిన గడువులోపు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు అందించే అదనపు ఆర్థిక సహాయంతోపాటు ఉచితంగా అందించే ఇసుక, రాయితీపై అందించే సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రిపై అవగాహన కల్పించి, ఇండ్ల నిర్మాణా పనులు వేగవంతంగా జరిగేలా గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. లక్ష్య సాధనలో వెనకబడిన గ్రామాల పట్ల ఎంపీడీవో, హౌసింగ్ ఏఈలు ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను సాధించే విధంగా కృషి చేయాలని కోరారు. హౌసింగ్ ఈఈ ఎస్. వెంకట్రావ్, డీఈఈ కె. శివప్రసాదరావు, ఎంపీడీవో కాండ్రు జ్యోతి, పామర్రు ఏఈ పవన్ కల్యాణ్ , ఐదుమండలాలకు చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ పోతురాజు

గ్యాస్ పైప్‌లైను భద్రత సూచనలు పాటించాలి

● ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : గ్యాస్ పైప్ లైన్ భద్రతా సూచనలు పాటించాలని, పైప్ లైన్ ఉన్న ప్రదేశాల్లో ఎటువంటి అక్రమ నిర్మాణాలు చేపట్టకూడదని ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక నాగవరప్పాడులోని ఆయుక్త ఫంక్షన్ హాల్లో గెయిల్ ఇండియా లిమిటెడ్, గుడివాడ ఆధ్వర్యంలో గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో గత రెవెన్యూ, పోలీస్, మత్స్యశాఖ, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, సిబ్బందికి సహజవాయు పైప్‌లైన్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డివిజన్ పరిధిలోని గెయిల్ పైప్‌లైన్ నెట్‌వర్క్ వివరాలు, వాటి భద్రత సంబంధించిన అంశాల గురించి ఆయా శాఖల అధికారులకు అందజేశారు. పైప్‌లైన్ ఉన్న ప్రాంతంలో చెరువులను, బోరుబావులను తవ్వకూడదని, గ్యాస్ పైప్‌లైన్‌కు హానీ కలిగించే ఎటువంటి చర్యలు చేపట్టవద్దని ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ ధీరజ్ వినీల్, గెయిల్ అధికారులు బాలకృష్ణయ్య, శ్రీకృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యం

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

గుడివాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : సీపీఆర్(కార్డియో పల్మనరీ రీససిటేషన్) ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజయవాడ రమేష్ ఆసుపత్రి క్రిటికల్ కేర్ హెచ్‌వోడీ డాక్టర్ ఎం.ధర్మేంద్రకుమార్ తెలిపారు. బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో స్థానిక శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం వరకు గుండెపోటు 65సంవత్సరాలు వయస్సు పైబడిన వారికి మాత్రమే వచ్చేదని, కరోనా వ్యాప్తి తరువాత వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు వస్తోందన్నారు. రబ్బర్ బొమ్మపై సీపీఆర్ ఎలా చేయాలో విద్యార్థులతో చేయించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు యలమంచిలి నాగేశ్వరరావు, గుళ్లపల్లి కిరణ్ బాబు, అసిస్టెంట్ గవర్నర్ రమణమూర్తి, పూర్వ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం, ఎన్ఎస్ఎస్ అధికారి చంద్ర పాల్గొన్నారు.


సీపీఆర్‌పై అవగాహన కలిగిస్తున్న వైద్యులు


చెత్తాచెదారాలను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

జాతీయ రహదారి పరిశుభ్రం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

పామర్రు,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి) : పెదమద్దాలి గ్రామ పంచాయతీ పరిధిలోని మచిలీపట్నం- విజయవాడ ప్రధాన రహదారి చెత్తడంపింగ్ యార్డును తలపిస్తుందని బుధవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రచురితమైన కథనానికి జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జె. అరుణ స్పందించారు. తక్షణమే రోడ్ల వెంబడి గుట్టలుగా పడేసిన చెత్తను తొలగించి ప్రయాణీల ఇబ్బందులను తొలగించాలని ఆమె పంచాయతీ కార్యదర్శి పూర్ణ చంద్రరావును ఆదేశించారు. మరోసారి ప్రజలకు అసౌకర్యం కలిగించే ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆమె హెచ్చరించారు. దాంతో యుద్ధప్రాతిపదికన కార్యదర్శి గ్రామ పారిశుధ్య సిబ్బందితోపాటుగా ప్రత్యేక ట్రాక్టర్లతో జాతీయ రహదారిపై గుడివాడ ఫ్లైఓవర్ దిగున ప్రాంతానికి చేరుకుని అక్కడ పేరుకు పోయిన చెత్తగుట్టలు, ప్లాస్టిక్, ఇతర దుర్వాసన వస్తున్న వ్యర్థాలను నాలుగు ట్రక్కులతో తొలగించారు. పరిశుభ్రంగా ఉండే విధంగా సున్నం, బ్లీచింగ్‌లు చల్లించారు.సమీప ప్రాంత రైతులు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభివందనలు తెలియజేశారు.


ఎంఈవోకు మందులను అందిస్తున్న వైద్యులు

నులిపురుగుల మందుల పంపిణీ

పెదపారుపూడి: బాలికలలో రక్తహీనతను తగ్గించి పోషకాహర గ్రాహ్యతను పెంచటానికి నులిపురుగుల నిర్మూల మందులు దోహదం చేస్తుందని పెదపారుపూడి డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 12వ తేదీ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని 1 నుంచి 19 సంవత్సరాల బాలబాలికలకు అవసరమైన డీ వార్మింగ్ మాత్రలను ఈ ఉదయం మండల వైద్యాధికారులతో కలసి ఎంఈవో , ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు అందజేశారు. అనంతరం నులిపురుగుల నిర్మూలన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెదపారుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రావిక, ఎంఈవో-2 సురేష్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు అరుణ కుమారి , ఎంపీహెచ్‌ఈవోలు చంద్రశేఖర్, నగేష్, అంకిరెడ్డి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో కార్డెన్ సెర్చ్

గుడివాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ కాలనీలో బుధవారం తెల్లవారుజామున డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీ అనంతా జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా ఎటువంటి గుర్తింపు పత్రాలు లేని 25 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకుని, మరో 20మంది వేలిముద్రలను సేకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కార్డెన్ సెర్చ్ వల్ల కాలనీలో కొత్తగా వచ్చిన వారిని గుర్తించి వారి వద్ద నుంచి సమాచారాన్ని సేకరించనున్నామన్నారు. పట్టణ ప్రాంతంలో అనుమానితులు, అసాంఘిక శక్తులుంటే తమకు సమాచారం అందించాలన్నారు. ప్రజలకు, పోలీసులకు మంచి సంబంధాలు ఉండాలని ఆకాంక్షించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే సమాచారమందిస్తే ఉక్కుపాదంతో అణచి వేస్తామని డీఎస్పీ ధీరజ్ వినీల్ హెచ్చరించారు. ఈ సెర్చ్‌లో సీఐలు కొండపల్లి శ్రీనివాస్, హనీష్, ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

తల్లిపాలే బిడ్డకు అమృతం

పెదపారుపూడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈదులమద్దాలి అంగన్వాడీ కేంద్రం వద్ద తల్లి పాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ అరుణ కుమారి తల్లులతో సమావేశమై, తల్లిపాలు బిడ్డకు తల్లికి ఇద్దరికీ ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. తల్లికి కూడా బరువు తగ్గటం, గర్భాశయం సాధారణ స్థితికి రావటానికి సహాయం పడుతుందని ఆమె తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

గుడివాడ : అరవపేటకు చెందిన వివాహిత అరవ మహాలక్ష్మి(35) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై వి.జాస్మిన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జాస్మిన్ తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గుడ్లవల్లేరు : నేటి కాలమాన పరిస్థితుల రీత్యా విద్యార్థులు ఒత్తిళ్లకు లోనవుతున్నారని దాని నుంచి బయట పడటానికి యోగా,ధ్యానం నిత్యం నిర్వహించడం ఎంతో అవసరమని ప్రముఖ యోగా గురువు రఘూగురీజీ అన్నారు. బుధవారం శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల (ఎస్.ఆంర్.జీ.ఈ.సి) లో మొదటి సంవత్సరం విద్యార్థులకు జీరో సెమిస్టర్‌లో భాగంగా విద్యార్థులపై యోగా- ధ్యాన ప్రక్రియల ప్రభావం అనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులచే ధ్యానం, యోగా చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రి, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.ఎన్.ఆర్.వి.ప్రసాద్, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, ఎస్‌పీఐ -25 కో-ఆర్డినేటర్ ఎల్.ఆర్.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సురేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ 15న

గుడివాడ : స్థానిక నెహ్రూచౌక్‌లో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కోసం ఈ నెల 15వ తేదీన స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో శంకుస్థాపన చేయనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు వాసే మురళీ తెలిపారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవి,తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేయాలి

● డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్

పెదపారుపూడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పది మంది వయోజనులకు విద్య నేర్పగలిగామన్న తృప్తి కలిగేలా ప్రతీ వలంటీరు చిత్తశుద్ధితో పని చేయాలని పెదపారుపూడి డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అక్షర ఆంధ్ర ఉల్లాస్ (సమాజంలో అందరికీ జీవిత కాల అభ్యాసనంపై అవగాహన) ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా మండలంలో తొలి దశలో గుర్తించబడిన 40 మంది ఎన్‌ఆర్‌ఈజీఎస్ వలంటీర్లకు ఈ ఉదయం, 90 మంది వెలుగు వలంటీర్లకు ఈ మధ్యాహ్నం స్థానిక మండల వనరుల కేంద్రంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. వెలుగు ఏపీఎం మహంకాళిరావు శిక్షకునిగా వ్యవహరించి వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవో-2 సురేష్, ఏపీవో పొట్లూరి రాంప్రసాద్, ఐసీడీఎస్ పర్యవేక్షకులు శివ నాగమణి, అరుణ కుమారి, చినపారుపూడి డిజిటల్ అసిస్టెంట్ విజయ కుమార్, ఉపాధి టీఏ రంగారావు, బీటీఎఫ్ అశోక్, వెలుగు సీసీలు రత్నకుమారి, నాగమణి, పాల్గొన్నారు.

ఎలుకల నివారణే ధ్యేయం

● ఏవో బోలెం అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు మూకుమ్మడిగా ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని ఏవో బోలెం అనంతలక్ష్మీ అన్నారు. బుధవారం ఏవో ఆధ్వర్యంలో లింగవరం, వలివర్తిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూకుమ్మడిగా ఎలుకల నివారణ చేపట్టడం వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుందని తెలిపారు. ఒకేసారి ఎలుకల నిర్మూలన వల్ల వరి దుబ్బులు చక్కగా ఉంటాయని తెలిపారు. కలుపు నివారణతోపాటు ఎలుకల నివారణ కూడా చేసుకుని తమ వరి పంటను కాపాడుకోవాలన్నారు. యూరియా ఎక్కువ మోతాదులో పొలాల్లో చల్లవద్దని చెప్పారు. యూరియా ఎక్కువగా చల్లటం వల్ల తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తాయని తెలిపారు.



రైతులకు సూచనలిస్తున్న ఏవో అనంతలక్ష్మి

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 490	

తాగునీరు సక్రమంగా విడుదల చేయండి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని మురికివాడల్లో తాగునీరు సక్రమంగా విడుదల చేయాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజును వైసీపీ కార్పొరేటర్లు కోరారు. పంపుల చెరువు వద్ద కమిషనర్‌తో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్లు గూడవల్లి నాగరాజు, గాజుల భగవాన్, జోగి చిరంజీవి తదితరులు మాట్లాడారు. స్లమ్ ఏరియాలకు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా కోరారు.

10న వైద్య శిబిరం

నాగాయలంక, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సహకారంతో మారుతీ విద్యానికేతన్ డిజిటల్ ఏసీ స్కూల్ ఆవరణలో ఈనెల 10వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని సుదర్శి మానవతా సేవాసంస్థ తెలిపింది. పెదకాకాని శంకర ఆస్పత్రి వైద్యులు సేవలందిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.



పశువుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ కుంచే నాని, డీఎస్పీ రాజా

రోడ్లపై తిరిగే పశువులను

మార్కెట్‌యార్డుకు తరలిస్తాం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రోడ్లపై తిరిగే పశువులను ఈనెల 11వ తేదీ నుంచి మార్కెట్ యార్డుకు తరలిస్తామని ఏఎంసీ చైర్మన్ కుంచే నాని తెలిపారు. ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బుధవారం బృందావనపుర గో పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పశువుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లపై తిరిగే పశువుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, పశువుల యజమానులు తమ పశువులను రోడ్లపై తిరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని డీఎస్పీ రాజా సూచించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, కోస్తా మురళీకృష్ణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టులు అంటూ వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉంటూ, కుటుంబసభ్యులకూ అవగాహన కల్పించాలని విద్యార్థులకు ఎస్పీ ఆర్.గంగాధరరావు సూచించారు. బుధవారం కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ ఆర్.గంగాధరరావు

సబ్ జైలు తనిఖీ

అవనిగడ్డ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సబ్ జైలును లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య బుధవారం తనిఖీ చేశారు. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న భోజన, వసతి సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. సత్ప్రవర్తనతో మెలగాలని, భవిష్యత్‌లో తప్పులు చేయకుండా జాగ్రత్తగా ఉండాలని ఖైదీలు ఆయన సూచించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు పాల్గొన్నారు.



అవనిగడ్డ సబ్‌జైలులో భోజనాలు పరిశీలిస్తున్న లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య

చెత్త తరలింపునకు రెండు కాంపాక్ట్ వాహనాలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డు నుంచి ఇకపై గుంటూరు జిందాల్‌కు రోజుకు 80 టన్నుల చెత్త పంపించేందుకు అవకాశం ఏర్పడింది. నగర పాలక సంస్థకు 30 టన్నుల చెత్త తీసుకుని వెళ్లే రెండు కాంపాక్ట్ వాహనాలు కొత్తగా వచ్చాయి. ప్రస్తుతం మూడు చిన్న వాహనాలు ఉన్నాయి. ఈ మూడు వాహనాల కెపాసిటీ 20 టన్నులు, నూతనంగా వచ్చిన 30 టన్నుల కెపాసిటీ ఉన్న రెండు వాహనాలతో రోజుకు 80 టన్నుల చెత్తను జిందాల్‌కు పంపనున్నారు.



నగరపాలక సంస్థకు కొత్తగా వచ్చిన కాంపాక్ట్ వాహనాలు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

అవనిగడ్డ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని ఎస్డీవో హనీష్ అహ్మద్‌కు నియోజకవర్గ పెన్షనర్లు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ శాఖా కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ అధ్యక్షతన పెన్షనర్ల నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సమస్యలను ఎస్డీవో దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరిస్తానని హనీష్ అహ్మద్ హామీ ఇచ్చారు. కార్యదర్శి అబ్దుల్ అజీజ్, సంఘ నేతలు ఎస్.సత్యనారాయణ, ప్రసాద్, కొల్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎస్డీవో హనీష్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నాగాయలంక, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాల్లో అవనిగడ్డ సహాయ వ్యవసాయ సంచాలకురాలు జె.ఎస్.జయప్రద, ఏవో ఎ.సంజీవ్‌కుమార్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. రూ.3,90,000 విలువైన 15 టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదలకు ఆదేశించారు. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లను అధికారులు హెచ్చరించారు.

రూ.2,04,983 విలువైన ఎరువులు సీజ్

కోడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎరువుల షాపుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రూ.2,04,983 విలువైన 12.645 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.కిరణ్‌కుమార్ తెలిపారు. వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, శ్రావణి ఫెర్టిలైజర్స్ యజమానులు ఇన్వాయిస్ చూపకపోవడం, బిల్లులు రాయకపోవడం, ఈపాస్ ఆన్‌లైన్, స్టాక్ రిజిస్టర్, నిల్వ స్టాక్ ట్యాలీ కాకపోవడం వల్ల సీజ్ చేసి, 6ఏ కేసు నమోదు చేశామన్నారు. ఏవో ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ పార్కులో ఓపెన్ జిమ్ ప్రారంభం

చల్లపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పార్కులో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్‌ను గురువారం ఉదయం ఆరు గంటలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. శ్రీమంతు క్లబ్ నిర్వహణలో పార్కులో ప్రజల ప్రయోజనార్థం పలువురు దాతల సహకారంతో జిమ్ ఏర్పాటుచేశారు. పారిశ్రామికవేత్త నాయుడు శ్రీధర్ రూ.4 లక్షలు, నాదెళ్ల పూర్ణచంద్రరావు, వేమూరి కృష్ణారావు, మాలెంపాటి కృష్ణ, పాలడుగు రత్నకుమార్‌లు రూ. లక్ష చొప్పున వితరణగా అందించి జిమ్‌ను ఏర్పాటుచేశారు.

కవయిత్రి భానుమతి మృతికి సంతాపం

అవనిగడ్డ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తెలుగు అవధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్ సతీమణి, కవయిత్రి భానుమతి మృతి పట్ల వర్ధమాన కవయిత్రులు దీవి రూప్సీ, సింహాద్రి పద్మ, ప్రముఖ కవి నల్లూరి లక్ష్మీనారాయణ భట్టాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అవధానాలు, భువన విజయం కార్యక్రమాల్లో భానుమతి ఉత్సాహంగా పాల్గొనే వారని పేర్కొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

అవనిగడ్డ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని, రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం తుంగలవారిపాలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అవనిగడ్డ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పరుచూరి దుర్గాప్రసాద్, నేతలు మండలి రామ్మోహనరావు, గంగు వరప్రసాద్, అడపా శ్రీనివాసరావు, ఘంటసాల రాజమోహనరావు(కన్నయ్య), గాలం శ్రీను, భోగిరెడ్డి నాగేశ్వరరావు, గంగు శ్రీనివాసరావు, గంగు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



తుంగలవారిపాలెం, వెలివోలులో సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

వెలివోలులో..

చల్లపల్లి: వెలివోలులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. 45, 46 బూత్‌ల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు తెలుసుకున్నారు. సమస్యలు నమోదు చేసుకున్నారు. సర్పంచ్ వేములమడ రజిత, క్లస్టర్ ఇన్‌చార్జి మోర్ల శివ, నేతలు మురాల నాగేశ్వరరావు, బొల్లా సత్యనారాయణ, బొల్లా వీరఅభిమన్యు, వాసిరెడ్డి రాకేష్, బొల్లా శ్రీనివాసరావు, కోనేరు శ్రీనివాసరావు, వేములమడ అనిల్ పాల్గొన్నారు.

పెదప్రోలులో..

మోపిదేవి: పెదప్రోలులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, పార్టీ గ్రామ అధ్యక్షుడు నాదెళ్ల రాజేష్, నాదెళ్ల శరత్ చంద్రప్రసాద్, బల్ల సీతారామప్రసాద్, మాతంగి వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

మేకావారిపాలెంలో..

మచిలీపట్నం టౌన్: బందరు మండలం మేకావారిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తలారి సోమశేఖర్, వాలిశెట్టి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చేలా అవుట్‌ఫాల్స్‌కు గేట్లు

● మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు ఆరోపణ

కోడూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు ఉపయోగపడే విధంగా కాకుండా, కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చేలా కోడూరు అవుట్‌ఫాల్స్ స్లూయిస్‌కు ఫైబర్ గేట్లు బిగించారని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు ఆరోపించారు. బుధవారం ఉల్లిపాలెం సమీపంలో కృష్ణా కరకట్టపై ఉన్న కోడూరు అవుట్‌ఫాల్స్ స్లూయిస్ గేట్లను ఆయన పరిశీలించారు. అవుట్‌ఫాల్స్ వద్ద మరమ్మతులు, కాంక్రీట్ ఫ్లోరింగ్ పనులు చేయకుండా గేట్లు బిగించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

సాగునీరు అందించకపోతే ఉద్యమం

పంట కాలువ చివర భూములకు సాగునీరు అందించకపోతే రైతు ఉద్యమం చేపడతామని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు హెచ్చరించారు. కోడూరు 11వ నెంబర్ కాల్వ కింద చివరి భూముల్లో నారుమడులను ఆయన పరిశీలించారు. నారుమడులు బతికించేందుకే రైతులు ట్యాంకర్ల సహాయంతో వేలాది రూపాయలు వెచ్చించి నీటిని తీసుకెళ్లాల్సి వస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు వంతుల విధానం ద్వారా కాలువ చివరి భూములకూ సాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, నాయకులు కొండవీటి వెంకటనారాయణ, వెర్రి శ్రీనివాసరావు, కటకం కుటుంబరావు, వెన్నా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు సక్రమంగా అందించండి

● తహసీల్దార్‌కు వైసీపీ సమన్వయకర్త ఉప్పాల రాము వినతి

బంటుమిల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత, బంటుమిల్లి ప్రధాన కాలువలో సాగునీరు తగినంత రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వైసీపీ పెడన నియోజకవర్గ సమన్వయ కర్త ఉప్పాల రాము డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ మండల కన్వీనర్ ముత్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీరు అందక వ్యవసాయ భూములు బీటలు వారుతున్నాయని, యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బంటుమిల్లి ప్రధాన కాలువలో నీటి మట్టం 3.8 అడుగులే ఉందని, 5 అడుగులు ఉండేలా చూడాలని ఏఈ రాజ్యలక్ష్మిని కోరారు. నాలుగు మండలాల రైతులతో కలిసి తహసీల్దార్ పూర్ణచంద్రరావుకు వినతిపత్రం ఇచ్చారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు తిరుమాని శ్రీనివాసరావు, ఎంపీపీలు వెలివెల చినబాబు, గరుడప్రసాద్, జడ్పీటీసీ సభ్యులు మలిశెట్టి వెంకటరమణ, మైలా రత్నకుమారి, రైతు సంఘం నాయకులు సుజ్ఞానం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు..సాగునీరు అందిస్తాం

● రైతులకు పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, మండలి వెంకట్రామ్ భరోసా

కోడూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అధైర్యపడొద్దని పూర్తిగా సాగునీరు అందిస్తామని రైతులకు పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ భరోసా ఇచ్చారు. బుధవారం 11వ నెంబర్ పంట కాలువ కింద సాగునీటి సరఫరాను, కోడూరు అవుట్ ఫాల్స్ ఫైబర్ గేట్లను ఇరిగేషన్ అధికారులతో కలిసి వారు పరిశీలించారు. ఎండల కారణంగా కాలువ దిగువ ప్రాంతాలకు సాగునీరు అందడం లేదని, వంతుల విధానం ద్వారా రైతులకు సాగునీరు అందిస్తామని వారు తెలిపారు. కోడూరు అవుట్ ఫాల్స్ స్లూయిస్ వద్ద ఫ్లోరింగ్ పనులకు అంచనాలు రూపొందించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని తెలిపారు. డీసీ చైర్మన్ బచ్చు రఘునాథ్‌ప్రసాద్, ఇరిగేషన్ డీఈ డి.గణపతి, ఏఈ విజయ్‌కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు బడే భావన్నారాయణ, నాయకులు మర్రె గంగయ్య, బొలిశెట్టి విఠల్ రావు పాల్గొన్నారు.

వరి నాటిన 35 రోజుల్లో

కలుపు నిర్మూలించుకోవాలి

చల్లపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వరి నాటిన 35 రోజుల్లో కలుపును నిర్మూలించుకోవాలని రైతులకు డీడీఏ జ్యోతిర్మయి సూచించారు. మంగళాపురంలో బుధవారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో వరిపంట సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నాట్లువేసిన మూడు రోజుల్లోపు ఆక్సిడయార్జిల్ లేదా 14, 15 రోజుల్లోపు పైరజోసల్ఫ్యురాన్ లేదా 35 రోజుల్లోపు 2,4 డీ సోడియం సాల్ట్‌లలో ఏదో ఒకదానిని పిచికారీ చేసుకోవాలని సూచించారు. సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి బి.పద్మజ సూచించారు. అర్హత ఉన్నప్పటికీ అన్నదాత సుఖీభవ నిధులు జమ కాని రైతులు వెంటనే గ్రామ వీఏఏలను సంప్రదించి అర్జీలు అందచేయాలని ఏవో కె.మురళీకృష్ణ సూచించారు. వీఏఏ జి.లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడీఏ జ్యోతిర్మయి

స్ఫూర్తిప్రదాత మండలి వెంకట కృష్ణారావు

అవనిగడ్డ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నేటితరం రాజకీయ నేతలకు దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని మాజీ ఎమ్మెల్యే డీవై దాస్ అన్నారు. శత జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం మండలి వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద ఆయన నివాళులర్పించారు. దివిసీమ ఉప్పెన తర్వాత ఈ ప్రాంత పునఃనిర్మాణానికి చేసిన కృషిని స్మరించుకున్నారు. మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.



మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీవైదాస్

అశ్వారావుపాలెంలో పీ-4 సర్వే

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపాలెం గ్రామంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబు పర్యటించారు. సర్పంచ్ లంకమ్మ ప్రసాద్ దత్తత తీసుకున్న 18 ఎస్టీ కుటుంబాలను పీ-4 సర్వే చేసి వారి వాస్తవ స్థితిగతులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో జింకు లోపం నివారణ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్యరక్షణ చర్యలతో వరి పొలాల్లో జింకు లోపాన్ని నివారించవచ్చని రైతులకు ఏవో రామ్‌కుమార్ సూచించారు. బొర్రపోతుపాలెం, పొట్లపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జింకులోప నివారణకు పొలంలో నిల్వ నీటిని తీసేసి కొత్త నీరు పెట్టాలన్నారు. లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్ల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. నాయకులు వన్నం సునీల్, వీఏవో శిరీష పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మనమిత్ర యాప్

పెడన, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మనమిత్ర వాట్సాప్ యాప్ ద్వారా పట్టణ ప్రజలు తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని మునిసిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి సూచించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో మనమిత్ర యాప్‌పై పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. మనమిత్ర యాప్ ద్వారా సమస్యలు తెలియజేసిన వారికి అవి ఎప్పటిలోగా పరిష్కారమవుతాయో కూడా తెలియజేస్తామన్నారు. మునిసిపల్ కార్యాలయ ఉద్యోగులు, సచివాలయాల ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

నారాయణరావునగర్‌లో కార్డన్ సెర్చ్

● ధ్రువీకరణ పత్రాలు లేని 46 బైక్‌లు, ఒక ఆటో సీజ్

చల్లపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నారాయణరావునగర్ కాలనీలో పోలీసులు బుధవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అవనిగడ్డ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో చల్లపల్లి, అవనిగడ్డ సీఐలు కె.ఈశ్వరరావు, యువకుమార్, సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్సైలు పీఎస్వీ సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, ప్రతాపరెడ్డి, శ్రీనివాసరావు, రాజేష్, చాణక్యతోపాటు పీఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్‌సీ, పీసీలు, సిబ్బంది పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి నివాసితుల వివరాలు సేకరించి, గుర్తింపుకార్డులు పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాలు లేని 46 బైక్‌లు, ఒక ఆటోను సీజ్‌చేసినట్లు చల్లపల్లి సీఐ ఈశ్వరరావు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో చల్లపల్లి, అవనిగడ్డ సీఐలు, సబ్‌డివిజన్‌లోని ఎస్సైలు

30 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో సీజ్

మచిలీపట్నం క్రైమ్: ఇనకుదురుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓగీసుపేటలో బుధవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించి పత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలను, ఒక ఆటోను సీజ్ చేసినట్టు డీఎస్పీ సీహెచ్ రాజా తెలిపారు. ఇనకుదురు ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, ఆర్‌పేట ఇన్‌స్పెక్టర్ ఏసుబాబు, చిలకలపూడి ఇన్స్పెక్టర్ అబ్దుల్ నబీ, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఓగీసుపేటలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వరద ప్రభావిత ప్రాంతాల్లో

సింథటిక్ చాపలు పంపిణీ

మోపిదేవి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాలైన బొబ్బర్లంక, కె.కొత్తపాలెం గ్రామాల్లో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో సింథటిక్ చాపలను అందజేశారు. కె.కొత్తపాలెం దళితవాడ, గౌడపాలెం, బొబ్బర్లంక గ్రామాల్లోని 850 కుటుంబాలకు చాపలు అందజేశారు. సర్పంచ్‌లు కొక్కిలిగడ్డ మాధవి, దొప్పలపూడి గంగాభవాని, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు పాల్గొన్నారు.

ఆముదార్లంకలో..

చల్లపల్లి: ఆముదార్లంకలో సింథటిక్ చాపలను ఎన్డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ ఎ.కిరణ్‌కుమార్ పంపిణీ చేశారు. ఆర్ఐ కృష్ణమోహన్, వీఆర్వో వెంకటేశ్వరరావు, కార్యదర్శి తిరుమలేష్, మండవ లక్ష్మీనరసయ్య, మండవ సీతారామారావు పాల్గొన్నారు.

పులిగడ్డ పల్లిపాలెంలో..

అవనిగడ్డ రూరల్: పులిగడ్డ పరిధిలోని పల్లిపాలెంలో గ్రామస్థులకు ఎన్డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ కిరణ్‌కుమార్ చాపలు పంపిణీ చేశారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఆర్ఐ బాలాజీ పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు..

అల్లాడుతున్న ప్రజలు

మోపిదేవి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు సమయపాలన లేకుండా గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తున్నారు. మోపిదేవి, పెదకళ్లేపల్లిలో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా, పెదకళ్లేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపురం, మెరకనపల్లి, కోసూరువారిపాలెం, అన్నవరం, పెదప్రోలు, నాగాయితిప్ప గ్రామాల్లో పగలూరాత్రీ తేడా లేకుండా గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఎప్పుడు విద్యుత్ వస్తుందని సబ్‌స్టేషన్ సిబ్బందికి ఫోన్ చేస్తే అందుబాటులో ఉండడం లేదని ప్రజలు చెబుతున్నారు. పగలంతా వ్యవసాయ పనులు చేసుకుని రాత్రి సమయాల్లో భోజనం చేసి నిద్రించే సమయంలో గంటల తరబడి విధిస్తున్న కోతలతో ప్రజలు రహదారులపైనే గడపాల్సి వస్తోంది. వర్షాకాలంలోనూ కోతలు విధిస్తుండటం ఏంటంటూ ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోతలు విధించే సమయాలు ముందుగా తెలియజేస్తే దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకుంటామని, ఇప్పటికైనా అప్రకటిత విద్యుత్ కోతలు నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యార్థులు రూపొందించిన క్రాఫ్ట్ ఐటమ్స్‌ను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ కో-ఆర్డినేటర్ ఆర్.కుముదిని సింగ్

భవిత కేంద్రం సందర్శన

చల్లపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆర్.కుముదిని సింగ్ బుధవారం సందర్శించారు. దివ్యాంగ విద్యార్థులకు అందుతున్న పథకాలు, అలవెన్స్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగ విద్యార్థుల చాక్‌పీస్ మేకింగ్, క్రాఫ్ట్ ఐటమ్స్‌ను పరిశీలించారు. విద్యార్థులను ప్రశంసించారు. భవిత సెంటర్ రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఏఐఎస్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, టీసీఎస్ పవన్, ఏఈఆర్పీలు ఎస్.లక్ష్మి, కె.గౌరి పాల్గొన్నారు.